E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 30-01-2026 (వారం) శుక్రవారం సంపుటి: 02 || సంచిక: 30 పేజీలు–6 www.ekaburu.com



యాదగిరిగుట్ట ఆలయంలో సిబ్బంది చేతివాటం!

» 3లో

# సల్లంగ చూసేందుకు సమ్మక్క వచ్చె!



## చిలుకలగుట్ట నుంచి గద్దెలపైకి చేరుకున్న వనదేవత

**ఈ-కబురు, మేడారం, జనవరి 29 : తన భక్తుల మీద వరములు చిలకరించేందుకు చిలుకలగుట్ట నుంచి కదిలివచ్చింది సమ్మక్క తల్లి! తనను నమ్ముకున్న భక్తులకు కష్టాల చీకట్లను తరమికొట్టి, వారిని సల్లంగ చూసేందుకు చల్లని పున్నమి వెన్నెల కాంతుల నడుమ మేడారం గద్దెపై ఆసీనురాలైంది. ఈ అపూర్వ ఘట్టాన్ని వీక్షించిన భక్త జనులు ఆనందపారవశ్యంతో 'జై సమ్మక్క..**

జైజై సమ్మక్క' అంటూ జయజయధ్వానాలు చేశారు. ఇలా రెండోరోజైన గురువారం మేడారంలో అత్యంత కీలక ఘట్టం పూర్తవ్వడంతో మహాజాతర పతాకస్థాయికి చేరింది. డోలూ సన్నాయి వాయిద్యాలు, శివసత్తుల పూనకాల నడుమ సరిగ్గా రాత్రి 9:47 గంటలకు సమ్మక్క గద్దెపైకి చేరుకుంది. సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు బుధవారమే గద్దెలపైకి చేరుకున్నారు. సమ్మక్క రాకతో నలుగురు దేవతలు ప్రభుత్వం ఆధునికీకరించిన గద్దెలపై కొలువుదీరడంతో జాతర పరిపూర్ణతను సంతరించుకుంది. సమ్మక్కను గద్దెపైకి చేర్చే కార్యక్రమంలో గిరిజన పూజారులు తెల్లవారుజాము నుంచే నిమగ్నమయ్యారు. తెలతెలవారుతుండగానే మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకొని ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. పేడతో చక్కగా అలికి.. తోరణాలు కట్టి.

తరువాయి 2లో

# కుతంత్రాలను ఖండిస్తున్నాం: హరీశ్



కేసీఆర్‌పై రాజకీయ కక్షతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు.

తరువాయి 3లో

# ప్రపంచ ఆశాకిరణం భారత్

ఈయూతో ఒప్పందం మహత్తరం

మన తయారీదారులకు మరిన్ని అవకాశాలు : మోదీ



**ఈ-కబురు, దిల్లీ: ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతున్న భారతదేశం ఇప్పుడు ప్రపంచానికి ఒక ఆశాకిరణంగా, ఆకర్షణ కేంద్రంగా మారుతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మన ప్రజాస్వామ్యం, జనసంఖ్య పరంగా మనకున్న బలం ప్రపంచానికి గొప్ప ఆశాభావాన్ని కలిగిస్తోందని చెప్పారు. ఐరోపా సమాఖ్య (ఈయూ)తో ఇటీవల కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) బృహత్తరమైనదని, దేశంలోని తయారీదారులకు దీనిద్వారా మరిన్ని అవకాశాలు లభించనున్నాయని చెప్పారు.**

తరువాయి 2లో

# అనిశ్చితిలోనూ పరుగే!

**వచ్చే ఏడాది ఆర్థిక వృద్ధి రేటు 6.8% నుంచి 7.2% ,వాణిజ్య ముప్పులు, అంతర్జాతీయ ఒడుదొడుకులున్నా ముందుకే.., ప్రజల బ్యాలెన్స్ షీట్లు కళకళ.. సామాజిక మాధ్యమాలపై వయసులవారీ నియంత్రణ అవసరం, ఆర్థిక సర్వేలో వెల్లడి, పార్లమెంటులో ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్**



ఈకబురు, దిల్లీ: అంతర్జాతీయంగా ఒడుదొడుకులు, వాణిజ్య ముప్పులు వెంటాడుతున్నా భారత్‌లో వచ్చే ఏడాది ఆర్థిక వృద్ధి రేటు పరుగులు తీయనుందని ఆర్థిక సర్వే వెల్లడించింది. అది ప్రపంచ సగటును మించి కొనసాగనుందని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారీ ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని భారత్ నిలబెట్టుకోనుందని వివరించింది. 202627 ఏడాదిలో ఆర్థిక వృద్ధి రేటు 6.8% నుంచి 7.2% మధ్య ఉండవచ్చని తెలిపింది. అయితే వినియోగం, పెట్టుబడుల్లో స్వల్ప తగ్గుదల కారణంగా ప్రస్తుత ఆర్థిక ఏడాది (202526) వృద్ధి రేటైన 7.4% కంటే వచ్చే ఏడాది స్వల్పంగా నెమ్మదించనుంది.

తరువాయి 2లో

# భారత్‌తో ఒప్పందం కుదుర్చుకుంటారా..!



**ఈ-కబురు, న్యూయార్క్: భారత్-ఐరోపా సమాఖ్య(ఈయూ)ల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అమెరికా అక్కసు వెళ్లగక్కుతోంది. ఈ ఒప్పందం.**

తరువాయి 3లో




# స్వచ్ఛమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

- 2030 నాటికి 20 వేల మెగావాట్ల హరిత ఇంధన ఉత్పత్తి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- వాయు కాలుష్యంతో వ్యవసాయ, ఆర్థిక వ్యవస్థలకూ నష్టమన్న నిపుణులు

**ఈ-కబురు, హైదరాబాద్: గాలి నాణ్యత అంటే పర్యావరణ సూచీ మాత్రమే కాదని.. అది ప్రజారోగ్యానికి, ఆర్థిక వ్యవస్థకు, ఉత్పాదకతకూ సూచీ అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కాలుష్యంతో ఊపిరాడని అభివృద్ధి నిజమైన పురోగతి కాదని..**

» 3లో

# 'మేడిగడ్డ'లో అత్యంత తీవ్ర లోపాలు



- దేశంలోని ప్రమాదకర మూడు డ్యాంలలో అదీ ఒకటి
- ముందస్తు భద్రత.. పునరావాస చర్యలకు ఎన్డీఎస్ఏ సూచనలు
- పార్లమెంట్‌లో జలశక్తి సహాయ మంత్రి చౌధరి వెల్లడి

**ఈ-కబురు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతలలోని మేడిగడ్డ(లక్ష్మి) బ్యారేజీలో అత్యంత తీవ్ర లోపాలున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దేశవ్యాప్తంగా మూడు డ్యాంలు ప్రమాదకరస్థితిలో ఉండగా.. మొదటి స్థానంలో మేడిగడ్డ.., తర్వాతి స్థానాల్లో ఉత్తర్ ప్రదేశ్‌లోని లోయర్ ఖజూరీ డ్యాం, ఝార్ఖండ్‌లోని బొకారో బ్యారేజీలు ఉన్నాయని పేర్కొంది. డ్యాం రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్(డ్రిప్) కార్యక్రమం అమలుపై గురువారం పార్లమెంట్‌లో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర జలశక్తిశాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌధరి సమాధానమిచ్చారు. జాతీయ ఆనకట్టల భద్రతా పర్యవేక్షణ సంస్థ(ఎన్డీఎస్ఏ) రూపొందించిన స్పెసిఫైడ్ డ్యామ్స్ జాతీయ రిజిస్టర్(ఎన్ఆర్ఎస్‌డీ) 2025లో 50 ఏళ్లు**

దాటిన 1681 డ్యాంలను నమోదు చేసినట్లు తెలిపారు. రాష్ట్రాల భాగస్వామ్యంతో చేపట్టిన అధ్యయనానికి సంబంధించిన వివరాలు, రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న డ్రిప్ నిధుల కేటాయింపు, వ్యయానికి సంబంధించిన వివరాలను మంత్రి వెల్లడించారు.

**మేడిగడ్డ రక్షణకు సూచనలు**

2025 వర్షాకాలానికి ముందు, తరువాత చేపట్టిన తనిఖీల తరువాత దేశవ్యాప్తంగా మూడు బ్యారేజీలు ప్రమాదం అంచున ఉన్న జాబితాలో(కేటగిరీ 1) ఉన్నాయి. వీటి విషయంలో తక్షణ భద్రతా చర్యలు, నష్టనివారణ, రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇదే కేటగిరీలో ఉన్న జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరిపై నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ పరిరక్షణకు ఎన్డీఎస్ఏ పలు సూచనలు చేసింది. ఈ బ్యారేజీ పియర్స్ 2023 అక్టోబరులో కుంగాయి. తెలంగాణ ప్రభుత్వ వినతి మేరకు ఎన్డీఎస్ఏ ఈ బ్యారేజీ నిర్మాణాలు మరింత దెబ్బ తినకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొంది.

తరువాయి 2లో

# విచారణకు రండి.. 'రెడీ'.. కానీ మరో రోజు



- నేడు విచారణకు రావాలన్న సిట్.. స్పందించిన కేసీఆర్
- జూబ్లీహిల్స్ ఏసీపీకి మాజీ సీఎం లేఖ
- మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమై ఉన్నా
- కాబట్టి మీకు అనుకూలమైన మరో తేదీన విచారణ జరపండి
- నిబంధనల మేరకు ఎర్రవల్లిలోని నా నివాసంలో విచారించండి
- దర్యాప్తునకు తన పూర్తి సహకారం ఉంటుందని వెల్లడి

ఈకబురు, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో శుక్ర వారం విచారణకు హాజరుకావాలని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) జారీ చేసిన నోటీసులపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు స్పందించారు. సిట్ విచారణకు హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అనేక మందికి అధికార పత్రాలు జారీ చేయడంలో నిమగ్నమైనందున సిట్‌కు అనుకూలమైన మరో తేదీన విచారణ జరపాలని కోరారు. మాజీ సీఎంగా, శాసనసభలో ప్రతిపక్ష నేతగా, బాధ్యతగల పౌరుడిగా దర్యాప్తునకు తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఈ మేరకు సిట్ విచారణ అధికారిగా ఉన్న జూబ్లీహిల్స్ డివిజన్ ఏసీపీ పి.వెంకటగిరికి గురువారం ఆయన లేఖ రాశారు.

**పార్టీ అధ్యక్షుడిగా బిజీగా ఉన్నా..**

'ఈ నెల 30న శుక్రవారం సిట్ ఎదుట విచారణకు రావాల్సిందిగా నన్ను కోరారు. కానీ ప్రస్తుతం 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరి తేదీ కావడంతో పార్టీ ప్రాతిపదికన జరుగుతున్న ఈ ఎన్నికల్లో పార్టీ అధ్యక్షుడిగా అనేక మందికి అధికార పత్రాలు జారీ చేయడంలో నేను పూర్తిగా నిమగ్నమై ఉన్నా. కాబట్టి మీకు అనుకూలమైన మరో ఇతర తేదీలో అయినా సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని నా నివాసంలో విచారణ నిర్వహించగలరు..'అని కేసీఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు.

తరువాయి 2లో


# బ్రాండ్ అంబాసిడర్లుగా..

- తెలంగాణలోని అవకాశాలను తెలియజేయండి
- హార్వర్డ్‌లోని భారతీయ విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ పిలుపు
- నేటితో ముగియనున్న క్లాసులు.. రేపు సర్టిఫికెట్ ప్రదానం



**ఈ-కబురు, తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని హార్వర్డ్ యూనివర్సిటీలోని భారత విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలోని అవకాశాలను ఇక్కడ తెలియజేయాలని, తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.**

తరువాయి 2లో



# చైనాబ్రిటన్ సంబంధాల్లో కొత్త అధ్యాయం

- జిన్‌పింగ్‌తో స్టార్మర్ భేటీ

**ఈ-కబురు, బీజింగ్: సుస్థిర, సుదీర్ఘ, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ నిర్ణయించుకున్నారు**

» 3లో




# ఉద్రిక్తతలు తీవ్రమవుతాయ్

**మ పార్టీని ఎన్నికల నుంచి బహిష్కరించడంపై హసీనా**

**ఈ-కబురు, ఢాకా: లక్షల మంది కార్యకర్తలను కలిగిన తమ పార్టీ అవామీ లీగ్‌ను ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక ఎన్నికల నుంచి బహిష్కరించడాన్ని, బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనా తప్పుబట్టారు.**

తరువాయి 2లో

# సమాజాన్ని చీల్చే ప్రమాదం ఉంది



యూజీసీ కొత్త నిబంధనలపై 'స్టే' విధిస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్య

ప్రాంతీయ వివక్ష, ర్యాగింగ్ సమస్యను చేర్చకపోవడంపై అభ్యంతరం

**ఈ-కబురు, దిల్లీ: ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ భావనను పెంపొందించే లక్ష్యంతో విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) ఇటీవల తీసుకొచ్చిన 'సమానత్వ కమిటీ'ల నూతన నిబంధనలపై సుప్రీంకోర్టు 'స్టే' విధించింది.**


తరువాయి 2లో

# ‘మేడిగడ్డ’లో అత్యంత తీవ్ర లోపాలు

డ్రిప్ రెండో దశలో రాష్ట్రానికి రూ.100 కోట్లు

దేశంలోని పాత డ్యాంల పరిరక్షణ చర్యలకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. డ్యాం సేఫ్టీ చట్టం 2021ని అనుసరించి కేంద్రం రాష్ట్రాల భాగస్వామ్యంతో ఆనకట్టల భద్రత, నిర్వహణ విషయంలో పలు కార్యక్రమాలు చేపడుతోంది. గతేడాది వర్షాకాలానికి ముందు 6524, తరువాత 6553 డ్యాంలకు సంబంధించి పరిశీలన పూర్తిచేసి రాష్ట్రాలు కేంద్రానికి నివేదిక సమర్పించాయి. ఆ మేరకు డ్యాంలను మూడు విభాగాలుగా విభజించారు. మొదటి కేటగిరీలో అత్యంత తీవ్రమైన లోపాలు ఉన్న వాటి వివరాలు, రెండో కేటగిరీలో భారీ లోపాలున్నవి, మూడో కేటగిరీలో చిన్నచిన్న లోపాలు వాటికి సంబంధించి తీసుకోవాల్సిన పరిరక్షణ చర్యలను పేర్కొంది.

డ్యాంల పరిరక్షణకు డ్రిప్ పథకం కింద కేంద్రం పదేళ్ల వ్యవధితో(20212031) కూడిన కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. 19 రాష్ట్రాలకు చెందిన 736 డ్యాంల పునరావాసానికి రూ.10,211 కోట్లు వెచ్చిస్తోంది. డ్రిప్2 కింద పలు ఆర్థిక సంస్థల సహకారంతో రూ.5,107 కోట్లు విడుదల చేసింది. డ్రిప్3 కింద రూ.5,104 కోట్ల కేటాయించింది.
డ్రిప్2 కింద గతేడాది డిసెంబరు నాటికి రాష్ట్రాలు రూ.2029 కోట్లు ఖర్చు చేశాయి. ఇదే పథకంలో తెలంగాణ నీటిపారుదలశాఖకు రూ.100 కోట్లు కేటాయించినట్లు కేంద్రం చూపింది.



## విచారణకు రండి.. 'రెడీ'.. కానీ మరో రోజు

**నిబంధనల మేరకు ఎర్రవల్లిలోనే..**
‘క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 160లోని నిబంధనల ప్రకారం □65 సంవత్సరాలకు పైబడిన పురుషుడు పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావలసిన అవసరం లేదు. అటువంటి వ్యక్తిని అతడు నివసిస్తున్న స్థలంలోనే విచారణ చేయాలనే నిబంధనలున్నాయి. కాబట్టి ఎర్రవల్లిలోని నా నివాసంలో మీరు విచారణ నిర్వహించవచ్చు..’అని కేసీఆర్ తెలిపారు.

**మున్సిపోల్స్‌పై దృష్టి పెట్టకుండా ఇబ్బంది పెట్టేందుకే..**
**– హరీశ్‌రావుతో సమావేశంలో కేసీఆర్**
మున్సిపల్ ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించకుండా బీఆర్ఎస్ అగ్ర నాయకత్వాన్ని ఇబ్బంది పెట్టడం లక్ష్యంగానే రేవంత్ ప్రభుత్వం సిట్ విచారణను తెరమీదకు తెచ్చిందని కేసీఆర్ అభిప్రాయపడినట్టు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసుల నేపథ్యంలో ఎర్రవల్లి నివాసంలో ఆయనతో మాజీ మంత్రి హరీశ్‌రావు భేటీ అయ్యారు. రెండురోజుల క్రితం సిట్ విచారణకు హాజరైన మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ కూడా ఈ భేటీలో పాల్గొన్నట్లు తెలిసింది. సిరిసిల్ల పర్యటనలో ఉన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కూడా ఈ సమావేశంలో పాల్గొనాల్సి ఉన్నా కేసీఆర్ ఆదేశాల మేరకు హాజరుకాలేదు.

**కాంగ్రెస్‌కు భయం పట్టుకుంది**
‘పంచాయతీ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ ఖంగుతింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ తిరిగి అవే ఫలితాలు ఎదురవుతాయనే భయం పట్టుకుంది. కాంగ్రెస్ రెండేళ్ల పాలన వైఫల్యాలు, కుంభకోణాలతో ప్రజలు విసిగిపోయారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అగ్ర నాయకత్వాన్ని కట్టడి చేసి కేడర్ మనో స్థైర్యం దెబ్బతీయడం ద్వారా మున్సిపల్ ఎన్నికల గండాన్ని దాటేందుకు కాంగ్రెస్ ఎత్తుగడలు వేస్తోంది. ఈ ప్రయత్నాలను వ్యూహాత్మకంగా ఎదుర్కొందాం. విచారణకు హాజరవడం ద్వారా ప్రభుత్వ కుట్రలను తిప్పి కొడదాం..’అని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. కాగా కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడాన్ని ఖండిస్తూ మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు పలువురు నేతలు వేర్వేరు ప్రకటనలు జారీ చేశారు.

## ఉద్రిక్తతలు తీవ్రమవుతాయ్



**మహమ్మద్ యూనస్ సారథ్యంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తమ పార్టీని ఎన్నికల్లో పాల్గొనకుండా చేసిందని ఆరోపించారు. అన్ని పార్టీలకూ పోటీ చేసే అవకాశం ఇవ్వకుండా నిరంకుశంగా నిర్వహించే ఎన్నికలవల్ల బంగ్లాదేశ్ దీర్ఘకాలం పాటు అస్థిరతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇలాంటి చర్యల వల్ల బంగ్లాదేశ్‌లో ప్రజాగ్రహం పెరుగుతుందని పేర్కొన్నారు. తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తుతాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలు, వ్యవస్థలే చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే దేశంలో అస్థిర పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. అసంపూర్ణ ప్రజా మద్దతుతో, అక్రమంగా బంగ్లాదేశ్‌లో ఏర్పడబోయే ప్రభుత్వం దేశంలోని అన్ని వర్గాల ప్రజలను ఏకం చేయలేదని హసీనా అభిప్రాయపడ్డారు. ఓ అంతర్జాతీయ వార్తాసంస్థ అడిగిన ప్రశ్నలకు ఆమె ఈమెయిల్ ద్వారా బదులిచ్చారు.**

## సల్లంగ చూసేందుకు సమ్మక్క వచ్చె!



ముగ్గులు వేశారు. అడవికి వెళ్లి వనాన్ని తీసుకొచ్చారు. ఉదయం 9 గంటలకు డప్పుచప్పుళ్ల మధ్య వనాన్ని తీసుకొస్తుండగా సమ్మక్క గుడి సమీపంలో బొడ్రాయి వద్ద మహిళలు నీళ్ల బిందెలతో ఎదురొచ్చి పూజారుల కాళ్లు కడిగారు. మంగళహారతులు పట్టారు. వనం తీసుకువచ్చే కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. మధ్యాహ్నం పూజారి సిద్దబోయిన మునేందర్ ఇంట్లో ఆడేరాలను (పసిడి కుండలు) సిద్ధం చేశారు. డోలు వాయిద్యాల మధ్య వాటిని సమ్మక్క గుడికి తరలించారు. గుడిలో తల్లికి సంబంధించిన మిగతా పూజా సామగ్రిని శుద్ధి చేశారు. పూజల అనంతరం మేకలు, కోళ్లను బలిచ్చారు. అనంతరం సాయంత్రం ఐదింటికి ప్రధాన పూజారి అయిన కొక్కెర కృష్ణయ్య, మరో ఆరుగురు పూజారులు మాల్యాల సత్యం, సిద్దబోయిన మునీందర్, సిద్దబోయిన బొక్కన్న, కొమ్ము స్వామి, కొమ్ము జనార్దన్.. చిలుకల గుట్టకు బయలుదేరారు.గుట్టపైకి కొంత దూరం వెళ్లాక ప్రధాన పూజారి మిగతా వారు ఆగిపోగా.. కృష్ణయ్య ఒక్కరే గుట్ట పైభాగాన తల్లి స్థావరం వద్దకు వెళ్లారు. అక్కడ సుమారు రెండు, మూడు గంటల పాటు ఆయన రహస్య పూజలు నిర్వహించారు. ఆ తర్వాత తల్లి రూపమైన కుంకుమ భరిణను తీసుకొని బయలుదేరారు. మార్గమధ్యలో వేచివున్న మిగతా పూజారులతో కలిసి కిందకు బయలుదేరారు. మంత్రులు సీతక్క, పొంగులేటి, అడ్లూరి లక్ష్మణ్, ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో పాటు వేలసంఖ్యలో భక్తులు ఎదురుచూస్తుండగా భరిణ రూపంలో ఉన్న సమక్కతో పూజారులు వచ్చారు. సమ్మక్కతల్లి రాకను పురస్కరించుకొని, ఆ తల్లికి గౌరవ సూచకంగా ములుగు ఎస్పీ సుధీర్ ఏకే 47తో గాల్లోకి నాలుగు రౌండ్లు పేల్చి వందనం సమర్పించారు. అనంతరం చిలుకల గుట్ట ప్రధాన ద్వారం వద్ద మరోదఫా మూడు రౌండ్లు గాల్లోకి పేల్చి తల్లి వస్తున్నట్టుగా భక్తులకు సంకేతాలు పంపారు. సమ్మక్కను పూజారులు మార్గమధ్యలో మేడారంలోని ఆమె గుడికి తీసుకువెళ్లారు. అక్కడ ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత సమ్మక్కను అక్కడి నుంచి తరలివస్తుండగా తల్లిని దర్శించుకునేందుకు దారి పొడవునా వేలాది మంది భక్తులు బారులు తీరి నిల్చున్నారు. పూజారులతో పాటు గద్దెల వరకు వెంటనడిచారు. సమ్మక్క రాక సందర్భంగా శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. తల్లి నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. పూజారులు తల్లిని గద్దెపై ప్రతిష్ఠించే సమయంలో భక్తుల దర్శనాలను కొద్దిసేపు నిలిపివేశారు. కరెంట్ సరఫరాను కూడా బంద్ చేశారు. సమ్మక్కను గద్దెపై నిలిపిన తర్వాత పది నిముషాల పాటు రహస్య పూజలు నిర్వహించి వెనుదిరిగిన తర్వాత తల్లి దర్శనానికి అనుమతిచ్చారు.



## ప్రపంచ ఆశాకిరణం భారత్



మొదటి పేజీ తరువాయి

వీటిని వారు అందిపుచ్చుకుని సామర్థ్యాన్ని పెంచుకోవాలని అభిప్రాయపడ్డారు. బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని ఆనవాయితీ ప్రకారం గురువారం పార్లమెంటు ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ‘‘పారిశ్రామిక దిగ్గజాలు, తయారీదారులు ఎలాంటి ఉదాసీనతకు తావులేకుండా ఉత్పత్తుల నాణ్యతపై దృష్టి సారించాలి. ఈయూలోని 27 దేశాల్లో మనం అత్యుత్తమ నాణ్యతతో ఉత్పత్తుల్ని విక్రయించి లాభాలతోపాటు అక్కడివారి మనసుల్లో చోటు దక్కించుకునేందుకు అవకాశం ఉంది. అది దశాబ్దాలపాటు మన బంధాలపై సానుకూల ప్రభావం చూపిస్తుంది. దేశం పేరుతో పాటు ఉత్పత్తి పేరు గర్వకారణంగా నిలుస్తుంది. సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌పై మనదేశం వేగంగా దూసుకుపోతోంది. సంస్కరణల ఆవిష్కరణలో ఎంపీలు సానుకూలంగా తమవంతు కృషి చేస్తున్నారు. వారికి నా కృతజ్ఞతలు.

**రిఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్**
ప్రజల జీవితాల్లోకి వెళ్లాలన్నదే ప్రభుత్వ ఆలోచన. సంస్కరించడం (రిఫార్మ్), పనిచేయడం (పెర్ఫార్మ్), మార్పు తీసుకురావడం (ట్రాన్స్‌ఫార్మ్)లో ప్రభుత్వ అసలు గుర్తింపు ఉంది. దీర్ఘకాల సమస్యల్ని వదిలించుకుంటూ శాశ్వత పరిష్కారాల కోసం పనిచేస్తున్నాం’’ అని మోదీ పేర్కొన్నారు.

**గొప్పలు ఆయనకు అలవాటే**
**కాంగ్రెస్**
ప్రతిసారీ పార్లమెంటు సమావేశాల సమయంలో గొప్పలు చెప్పుకోవడం మోదీకి అలవాటేనని, తాజా మాటలూ దానిలో భాగమేనని కాంగ్రెస్ విమర్శించింది. జాతీయ అంశాల్లో విపక్ష అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ఆయన ఎన్నడూ అఖిలపక్ష సమావేశానికి అధ్యక్షత వహించరని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ వ్యాఖ్యానించారు.

## బ్రాండ్ అంబాసిడర్లుగా..



అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో సర్టిఫికెట్ కోర్సును అభ్యసిస్తున్న సీఎం రేవంత్‌ను అక్కడ చదువుతున్న భారతీయ విద్యార్థి బృందం తమ క్యాంప్‌సను సందర్శించాలని ఆహ్వానించింది. ఈమేరకు తన అసైన్‌మెంట్లు, హోం వర్క్‌లు పూర్తయిన తరువాత రేవంత్ విద్యార్థులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తన రాజకీయ ప్రస్థానం, సీఎం కావడానికి దోహదపడిన అంశాలతోపాటు తన విజయ మంత్రాన్ని వారికి వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రూపొందించిన తెలంగాణ రైజింగ్ విజన్‌ను తెలియజేశారు. భారత్ అభివృద్ధిలో విద్యార్థులు కీలకమని, వారి ప్రతిభ దేశాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. కాగా, హార్వర్డ్ యూనివర్సిటీలో సీఎం రేవంత్ హాజరవుతున్న సర్టిఫికెట్ కోర్సు క్లాసులు శుక్రవారంతో ముగియనున్నాయి. శనివారం సర్టిఫికెట్ ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆదివారం ఆయన అమెరికా నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనం కానున్నారు.

## సమాజాన్ని చీల్చే ప్రమాదం ఉంది



కొత్త నిబంధనల్లో స్పష్టత కొరవడిందని, ర్యాగింగ్ సమస్యను చేర్చలేదని, వినియోగించిన భాష సరిగా లేదని అభిప్రాయపడింది. సమాజాన్ని చీల్చే ప్రమాదం కూడా ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం గురువారం ఆందోళన వ్యక్తం చేసింది. నిబంధనల వివాదంపై దాఖలైన మూడు పిటిషన్లకు సంబంధించి మార్చి 19కల్లా స్పందనను తెలియజేయాలని కేంద్రం, యూజీసీలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు యూజీసీ(ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వ ప్రోత్సాహక) నిబంధనలు2026 అమలును నిలిపివేయాలని ఆదేశించింది.

అంతవరకు పాత నిబంధనలు(2012) అమల్లో ఉంటాయని పేర్కొంది. తదుపరి విచారణ మార్చి 19వ తేదీకి వాయిదాపడింది. సమానత్వ కమిటీ నూతన నిబంధనల్లోని కొన్ని అంశాలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. ముఖ్యంగా జనరల్ కేటగిరీ విద్యార్థులకు ఫిర్యాదు చేసే హక్కు లేకపోవడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పలు రాష్ట్రాల్లో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం... ‘మేము జోక్యం చేసుకోకపోతే ఇది ప్రమాదకర పరిణామాలకు దారి తీస్తుంది. సమాజాన్ని చీల్చే ప్రభావం చూపిస్తుంది’ అని అభిప్రాయపడింది. యూజీసీ కొత్త నిబంధనలను నిపుణులు పునఃపరిశీలించి మార్పులు చేయాల్సిన అవసరం ఉందని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. కొత్త నిబంధనల్లోని సెక్షన్ 3(సి) ప్రకారం కుల వివక్ష నిర్వచనాన్ని కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకే పరిమితం చేయడంపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. ప్రాంతీయ తత్వంతో కొనసాగే వివక్షను విస్మరించడాన్ని, ర్యాగింగ్ సమస్యను చేర్చకపోవడాన్ని జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ప్రశ్నించారు. 2019లో రోహిత్ వేముల, పాయల్ తడ్వి తల్లులు దాఖలు చేసిన పిల్ ఆధారంగానే నిబంధనలు రూపొందాయని సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ కోర్టుకు తెలిపారు. కుల వివక్షను పూర్తిగా నిర్మూలించాలన్న రాజ్యాంగ లక్ష్యంతోనే ఈ నిబంధనలు వచ్చాయని వాదించారు. సుప్రీంకోర్టు ‘స్టే’ ఉత్తర్వులను భాజపా, ఎస్పీ, బీఎస్పీ, టీఎంసీ తదితర పార్టీల నేతలు స్వాగతించారు.

# డైమండ్ హైట్స్ లో ప్రారంభమైన "మంజీర ప్రీమియర్ లీగ్"



మంజీర ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి




పోటీల్లో భాగంగా స్థానికులతో కలిసి క్రికెట్ ఆడుతున్న గచ్చిబౌలి కార్పొరేటర్

**ప్రతి కమ్యూనిటీలో ఈ తరహా క్రీడా పోటీలు నిర్వహించాలి : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

ఈకబురు, శేరిలింగంపల్లి : క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లిలో గల మంజీర డైమండ్ హైట్స్ గేటెడ్ కమ్యూనిటీలో "మంజీర ప్రీమియర్ లీగ్" పోటీలు ఏర్పాటు చేశారు. గురువారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై లీగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని, ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడతాయని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత క్రీడల ద్వారా క్రమశిక్షణ, జట్టు భావం, నాయకత్వ లక్షణాలను అలవాటు చేసుకుంటారని అన్నారు. ఇటువంటి క్రీడా కార్యక్రమాలు ప్రజల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి కమ్యూనిటీలో ఇలాంటి క్రీడా వేదికలు ఏర్పాటుచేసి, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మంజీర డైమండ్ హైట్స్ కమ్యూనిటీ వాసులు క్రీడా పోటీలు నిర్వహించి ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచారని అభినందించారు. క్రీడా కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు శివసింగ్, రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హనుమంతు నాయక్, మంజీర డైమండ్ హైట్స్ గేటెడ్ కమ్యూనిటీ అధ్యక్షులు ప్రసాద్, ఉపాధ్యక్షులు అనుషుమన్ మిశ్రా, సెక్రెటరీ శ్యామ్ ప్రధాన్, ట్రెజరర్ శ్రీనివాస్ రావు, ఎంసీ మెంబర్స్ అంకుర్, జ్ఞానేశ్వర్, సోమేశ్ మిశ్రా, మంజీరా డైమండ్ హైట్స్ అధ్యక్షులు పిఆర్ రావు, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సుందర చారి, జాయింట్ సెక్రెటరీ సుమంత్, సీనియర్ నాయకులు మురుగ, విష్ణు, శివ, సాయి, మధు, సాయి, వంశీతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# అనిశ్చితిలోనూ పరుగే!



ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ ఆధ్వర్యంలో రూపొందించిన 739 పేజీల 202526 ఆర్థిక సర్వేను గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు.

ముఖ్యాంశాలు..

ఇటీవలి సంవత్సరాల్లో చేపట్టిన పాలసీ సంస్కరణల సంచిత ప్రభావం.. మధ్యకాలిక వృద్ధి అవకాశాలను 7శాతానికి దగ్గరగా చేర్చింది. దీంతో అంతర్జాతీయ అనిశ్చితిని తట్టుకుని ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని సాధిస్తోంది.

సుంకాలవల్ల దెబ్బతిన్న కార్మిక రంగానికి పాలసీలు, పన్ను సంస్కరణలతో ఊతమిచ్చింది. జీఎస్టీ రేట్ల తగ్గింపు, కార్మిక చట్టాల సమూల ప్రక్షాళన ద్వారా వ్యాపారాలపై భారాన్ని తగ్గించడం, ఐరోపా కూటమితో కలిపి నాలుగు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై ముందుకు సాగడం కలిసి వచ్చాయి.

అమెరికా సుంకాలవల్ల డాలరుతో పోలిస్తే రూపాయి 5శాతం పడిపోయింది. అయితే దాని విలువ భారత ఆర్థిక అద్భుత గణాంకాలను ప్రతిబింబించడం లేదు.

భారీ సుంకాల ఒత్తిడి ఉన్నా భారత్ వృద్ధి రేటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.2%గా ఉండనుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) వెల్లడించింది.

అమెరికాతో జరుగుతున్న చర్చలు ఈ ఏడాదిలో ఫలించి ప్రస్తుతం నెలకొన్న అనిశ్చితి తొలగిపోవచ్చు.

ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయ పన్ను చట్టంతో మరింత సరళత్వంతోపాటు పన్ను చెల్లింపుదారులకు నిర్మాణాత్మక స్పష్టత రానుంది.

వ్యవసాయ, ఆక్వా ఉత్పత్తులు, ఆహారం, పానీయాల ఎగుమతులు వచ్చే నాలుగేళ్లలో 100 బిలియన్ల అమెరికా డాలర్లకు చేరనున్నాయి. అయితే పాలసీల్లో తరచూ మార్పులు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, అంతర్జాతీయంగా అనిశ్చితి, విదేశీ కొనుగోలుదారులు ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లడంవంటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది.

ఇటీవలి కాలంలో పలు రాష్ట్రాలు వ్యవసాయ రంగంలో సంస్కరణలను చేపట్టాయి. భూ నిర్వహణ, మార్కెట్లు, నీటి నిర్వహణ, టెక్నాలజీ వినియోగం, భిన్న పంటల సాగువల్ల వ్యవసాయ దిగుబడులు పెరిగాయి. 2018 నుంచి స్థిరంగా ఉన్న యూరియా ధరలను పెంచాలి. అదే స్థాయిలో సబ్సిడీని బదిలీ చేయాలి.

జీడీపీలో ద్రవ్య లోటును 4.4 శాతానికి తగ్గించే సరైన లక్ష్యం దిశగానే ప్రభుత్వం సాగుతోంది. రాష్ట్రాల రెవెన్యూ లోటు పెరుగుతున్నా.. అవి జీడీపీలో 2.4శాతం మూలధన వ్యయాన్ని కొనసాగించేలా కేంద్రం సహకరిస్తోంది.

ఏఐలో భారత్ ఆలస్యంగానే ప్రవేశించినా లక్ష్యం దిశగా వేగంగానే సాగుతోంది. అయితే అందులో ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదమూ పొంచి ఉంది.

నిజాయతీగా పనిచేసే అధికారులకు రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వేధించే విచారణల నుంచి వారికి రక్షణ కల్పించాలి.

డిజిటల్ ఎడిక్షన్ తగ్గించాలి

డిజిటల్ ఎడిక్షన్‌ను తగ్గించేందుకు వయసు ఆధారిత సోషల్ మీడియా అందుబాటు వ్యవస్థను ప్రవేశపెట్టాలి.

ఆన్‌లైన్ బోధన టూల్స్‌పై ఆధారపడటాన్ని తగ్గించాలి. పిల్లలకు బేసిక్ ఫోన్ల వంటివే అందజేయాలి. చదువు కోసమే రూపొందించే ట్యాబ్‌లను ఇవ్వాలి.

అల్ట్రా ప్రాసెస్డ్ ఆహార వాణిజ్య ప్రకటనలను ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకూ నిషేధించాలి.

సున్నిత సమాచారాన్ని మినహాయించేలా సమాచార హక్కు చట్టాన్ని పునర్వ్యవస్థీకరించాలి.

ప్రయాణికుల ఛార్జీల పెంపుతో సరకు రవాణాపై ఆధారపడే పరిస్థితి నుంచి రైల్వేశాఖ నెమ్మదిగా బయటకు వస్తోంది. సరకు రవాణా ఆదాయం 68 శాతం నుంచి 65శాతానికి తగ్గింది. భవిష్యత్తులో 62శాతానికి తగ్గనుంది.

పోషకాహార అంతరంతో జీవన శైలి వ్యాధులు

పోషకాహార అంతరాలతో పెరిగి పోతున్న జీవన శైలి వ్యాధులను అరికట్టేందుకు ఆరోగ్య సప్లిమెంట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇందుకోసం ఆహార సంబంధిత సంస్కరణలను తేవాలి. వైద్యపరంగా అందించే చికిత్సలకు ఎనర్జీ, పోషక పానీయాలు, ఒత్తిడి తగ్గించే సూత్రీకరణలు, బరువు తగ్గించే పానీయాలు సమానం కాదని ప్రజలకు తెలియజేయాలి. దేశంలోని చాలా మంది ప్రజలు.. సూచించిన దాని కంటే అధికంగా తృణ ధాన్యాలను వినియోగిస్తున్నారు. తక్కువ రక్షణ కల్పించే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుంటున్నారు. ీయ దేశంలో స్థూలకాయం అనేది వయసులతో సంబంధం లేకుండా పెరుగుతోంది.

సబ్సిడీలతో మేలే..

ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ చర్యలవల్ల పేదరికం తగ్గింది. అట్టడుగు స్థాయిలో ఉండే 5% నుంచి 10% మంది ప్రజల వినియోగ వ్యయం పెరిగింది.

సబ్సిడీలు, పించన్లు, నగదు బదిలీలతోపాటు విద్య, వైద్యంపై ప్రభుత్వ వ్యయం పెరగడం వల్ల సానుకూల ఫలితాలొస్తున్నాయి.

రాష్ట్రాల వ్యయాలపై ఆందోళన

నగదు బదిలీల వంటి ఆర్థిక ప్రజాదరణ పథకాల వ్యయం మూల ధన వ్యయాన్ని మించడం ఆందోళన కలిగిస్తోంది. చాలా రాష్ట్రాల్లో బేషరతు నగదు బదిలీ (యూసీటీ) పథకాలు వేగంగా విస్తరిస్తున్నాయి. వాటి సంక్షేమ వ్యయంలో వీటి వాటానే అధికమవుతోంది.

2026 ఆర్థిక సంవత్సరంలో మహిళలకు యూసీటీ కింద 1.7 లక్షల కోట్ల నగదు బదిలీ జరిగింది.

యువతకు శిక్షణలో వెనుకబాటే

15, 29 ఏళ్ల మధ్య వయసున్న యువతలో కేవలం 4.9శాతం మందికే వొకేషనల్, టెక్నికల్ శిక్షణ అందుబాటులో ఉంటోంది. దీనిని విస్తరించాల్సిన అవసరముంది.

పా రశాలల్లోనే నైపుణ్య శిక్షణ అందించాలి.

40శాతం గిగ్ వర్కర్లు.. నెలకు రూ.15వేల కంటే తక్కువ వేతనాన్నే పొందుతున్నారు.

సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌ను ఆవిష్కరించింది

ప్రధాని 'పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే సంస్కరణల ఎక్స్‌ప్రెస్ సమగ్ర చిత్రాన్ని ఆవిష్కరించింది. సవాళ్లతో కూడిన అంతర్జాతీయ పరిస్థితుల్లోనూ స్థిరమైన అభివృద్ధిని సూచించింది. ఇది బలమైన స్థూల ఆర్థిక మూలాలను, స్థిరమైన వృద్ధి వేగాన్ని, దేశ నిర్మాణంలో ఆవిష్కరణలు, మౌలిక

# స్వచ్ఛమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

స్వచ్ఛమైన గాలితో కూడిన ఆర్థిక వృద్ధే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. దిల్లీ ఎదుర్కొంటున్న తీవ్రమైన వాయు కాలుష్య పరిస్థితులు హైదరాబాద్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలకు గట్టి హెచ్చరికగా పేర్కొన్నారు. ప్రణాళికశాఖ.. గురువారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 'గాలి నాణ్యత నిర్వహణ' అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ''కాలుష్య నియంత్రణకు అవసరమైతే కఠిన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కలిసే సాగాలి. తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా ఎదిగింది. 'స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ రిపోర్ట్2024' ప్రకారం అత్యధిక మరణ కారకాల్లో వాయుకాలుష్యం రెండో స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా 80 లక్షల మంది కాలుష్యంతో మరణిస్తున్నారు. ప్రపంచబ్యాంక్ అంచనాల ప్రకారం వాయుకాలుష్యంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఏటా సుమారు 4 ట్రిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతోంది. తెలంగాణ ప్రభుత్వం శాస్త్రీయ దృక్పథాన్ని అనుసరిస్తోంది. 2024లో దాదాపు 40 కొత్త గాలినాణ్యత మానిటరింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసి నెట్‌వర్క్‌ను రెట్టింపు చేశాం. 2030 నాటికి రాష్ట్రంలో హైడ్రోజన్, సౌర, గాలి విద్యుత్‌తో 20,000 మెగావాట్ల హరిత ఇంధన ఉత్పత్తి లక్ష్యంగా చర్యలు చేపట్టాం. కాలుష్య నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి. హైదరాబాద్‌ను మరింత స్వచ్ఛంగా, పచ్చగా, నివసించదగిన నగరంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది'' అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వాయుకాలుష్యం ఆరోగ్యంపైనే కాకుండా వ్యవసాయ, ఆర్థిక, వాతావరణ వ్యవస్థలపైనా దుష్ప్రభావం చూపుతోందని సుమిత్‌శర్మ (యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగాం దిల్లీ) తెలిపారు. కాలుష్యంతో భారత్‌లో గోధుమ దిగుబడి 30% తగ్గిపోతోందని.. వాయు కాలుష్యం క్రికెట్ మ్యాచ్‌లకూ అంతరాయం కలిగిస్తోందన్నారు. ఈ సమస్యతో విరాట్ కోహ్లి ఔటయిన సందర్భాన్ని తాను ప్రత్యక్షంగా చూశానన్నారు. నగరాల్లో కాలుష్య హాట్‌స్పాట్లను గుర్తించి.. నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రొఫెసర్ ముఖేశ్‌కుమార్ శర్మ (ఐఐటీ కాన్పూర్) సూచించారు. హైదరాబాద్‌లో ఔటర్ రింగ్‌రోడ్డు వరకు వాయుకాలుష్యంపై అధ్యయనం చేయాలన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో గాలి నాణ్యత పర్యవేక్షణ నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నట్లు పీసీబీ సభ్య కార్యదర్శి రవి వివరించారు. హాట్‌స్పాట్ ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతో సెన్సర్ల పర్యవేక్షణ నెట్‌వర్క్, డ్యాష్‌బోర్డులు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఏర్పాటుచేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచడం కాలుష్య నియంత్రణకు ఓ పరిష్కార మార్గంగా ప్రొఫెసర్ రాజ్‌కిరణ్ (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్‌కాలేజ్ ఆఫ్ ఇండియా) సూచించారు. దీర్ఘకాలిక రవాణా ప్రణాళికల్ని రూపొందించాలన్నారు. సదస్సులో అటవీ, పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం, ప్రణాళికశాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి, పరిశ్రమలశాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, ప్రొఫెసర్ సురేష్‌జైన్, పర్యావరణ నిపుణురాలు కృతిక తదితరులు పాల్గొన్నారు.





# కుతంత్రాలను ఖండిస్తున్నాం: హరీశ్



ఈకబురు, హైదరాబాద్ కేసీఆర్‌పై రాజకీయ కక్షతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్‌ను టచ్ చేయడమంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమేనని గురువారం 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన కేసీఆర్ వంటి నాయకుడిపై బురద చల్లాలని ప్రయత్నించడం సూర్యుడిపై ఉమ్మి వేయడమేనని విమర్శించారు. సింగరేణి బొగ్గు కుంభకోణం మరకల నుంచి దృష్టి మళ్లించేందుకు సిట్ పేరుతో నోటీసులు జారీ చేయడం రేవంత్‌రెడ్డి చౌకబారు రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. కాగా, కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నేతలు కొప్పుల ఈశ్వర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సి.లక్ష్మారెడ్డి, కర్నె ప్రభాకర్ పేర్కొన్నారు.

# యాదగిరిగుట్ట ఆలయంలో సిబ్బంది చేతివాటం!



ఈకబురు, యాదాద్రి, జనవరి 29 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి సన్నిధిలో బంగారు, వెండి నాణేల విక్రయాల్లో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయి. బంగారు, వెండి నాణేల (డాలర్ల)పై స్వామివారి ప్రతిమలు ముద్రించి భక్తులకు విక్రయిస్తుంటారు. ఏరోజుకారోజు బులియన్ మార్కెట్ ధరల ప్రకారం వీటి ధరను నిర్ణయిస్తారు. కానీ, కొంత కాలంగా నాణేల విక్రయాలపై అధికారుల పర్యవేక్షణ లోపించింది. ఆ విభాగంలో విధులు నిర్వహించిన సిబ్బంది చేతివాటం కారణంగా స్టాక్ రిజిస్టరులో విక్రయాలు, ఖజానాకు జమ చేసిన నగదు మధ్య భారీ వ్యత్యాసాలను ఆలయ అంతర్గత ఆడిట్ అధికారులు గుర్తించారు. సిబ్బంది లక్షల రూపాయల చేతివాటం ప్రదర్శించినట్లుగా తేల్చారు. దీంతో గురువారమే ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారి భవానీ శంకర్.. ఈ అక్రమాలపై ఉన్నతస్థాయి అధికారులతో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు.

అనధికారికంగా విధులు నిర్వర్తించే వ్యక్తే..

బంగారు, వెండి నాణేలతో పాటు స్వామివారి సాహిత్యం, క్యాలెండర్లు, డైరీలను ఆలయ ప్రచార శాఖ ద్వారా భక్తులకు విక్రయిస్తుంటారు. ఏడాది క్రితం బదిలీపై యాదగిరిగుట్టకు వచ్చిన జూనియర్ అసిస్టెంట్ రామచంద్రశేఖర్ ఈ శాఖలో పనిచేస్తున్నారు. ఆయన అనారోగ్యానికి గురికాగా, కుమారుడు కౌశిక్ కొద్ది నెలలుగా అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నాడు. అధికారులు మానవతా దృక్పథంతో చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో కౌశిక్ చేతివాటం ప్రదర్శించి రూ.10లక్షల విలువ గల నాణేలను విక్రయించి, ఖజానాకు జమ చేయలేదని తెలుస్తోంది.

# భారత్‌తో ఒప్పందం కుదుర్చుకుంటారా..!

ఈకబురు, న్యూయార్క్: భారత్‌ఐరోపా సమాఖ్య(ఈయూ)ల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అమెరికా అక్కసు వెళ్లగక్కుతోంది. ఈ ఒప్పందం.. భారత్‌కే లాభదాయకంగా ఉందంటూ అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ చేసిన ఇటీవల వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఏకంగా అగ్రరాజ్య ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఒప్పందంపై తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేశారు. ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యా దగ్గర నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌తో యూరోపియన్లు సయోధ్య కుదుర్చుకోవడం తనను తీవ్ర నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధం కొనసాగుతున్నప్పటికీ వాణిజ్య ప్రయోజనాలకే ఈయూ ప్రాధాన్యం ఇచ్చిందంటూ మండిపడ్డారు. ''వాళ్లకు ఏది ఉత్తమమైందో వారు అది చేయాలి. కానీ యూరోపియన్లు నన్ను చాలా నిరాశపరిచారు'' అని అన్నారు. గతేడాది భారత దిగుమతులపై అమెరికా భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. తమలాగే భారత్‌పై అదనపు సుంకాలు విధించేందుకు అప్పుడు ఈయూ విముఖత వ్యక్తం చేసిందన్నారు. సొంత వాణిజ్య ఒప్పందం కోసం ముందుకువెళ్లాలనే ఉద్దేశంతోనే, వారు ఆ పని చేసేందుకు ఇష్టపడలేదన్నారు. ఉక్రెయిన్ ప్రజల కంటే వాణిజ్య ప్రయోజనాలకే ఐరోపా ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ''రష్యా చమురు భారత్‌కు వెళుతోంది. దాన్ని శుద్ధి చేసి భారత్ చమురు ఉత్పత్తులు తయారుచేస్తుంది. ఇప్పుడు యూరోపియన్లు వాటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో రష్యా యుద్ధానికి వారు పరోక్షంగా నిధులు సమకూరుస్తున్నారు'' అని బెసెంట్ ఆరోపించారు. ఈ వాణిజ్య ఒప్పందంపై బెసెంట్ గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ఉక్రెయిన్ ప్రజల గురించి మాట్లాడే ఐరోపా నేతలు, వాస్తవానికి వాణిజ్య ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. అవసరమైతే తాము కూడా రష్యా చమురును కొనుగోలు చేసి చౌకైన ఇంధనం పొందవచ్చని, కానీ అలా చేయడానికి అమెరికా సిద్ధంగా లేదని బెసెంట్ వ్యాఖ్యానించారు.



## మారుతీ సుజుకీ లాభం రూ.3,879 కోట్లు





మారుతీ సుజుకీ ఇండియా, డిసెంబరు త్రైమాసికంలో రూ.3,879 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3,727 కోట్లతో పోలిస్తే ఇది 4% అధికం. కొత్త లేబర్ కోడ్ అమలు కోసం రూ.594 కోట్ల ఏక కాల కేటాయింపు జరపడం వల్ల, నికర లాభంపై ప్రభావం చూపినట్లు సంస్థ తెలిపింది. కార్యకలాపాల మొత్తం ఆదాయం రూ.38,764 కోట్ల నుంచి రూ.49,904 కోట్లకు చేరింది. కంపెనీ గతంలో ఎన్నడూ లేనంత అధికంగా, సమీక్షా త్రైమాసికంలో 5,64,669 కార్లను దేశీయ విపణిలో విక్రయించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో విక్రయించిన 4,66,993 కార్ల కంటే ఇవి 97,676 అధికం. పెరిగిన విక్రయాల్లో చిన్న కార్లే 68,328 ఉన్నాయి. వీటిపై జీఎస్టీ 28% నుంచి 18 శాతానికి తగ్గడం ఇందుకు కారణం. సమీక్షా త్రైమాసికంలో మొత్తం విక్రయాలు 6,67,769 (ఎగుమతులు 1,03,100)కు చేరాయి. 2024-25 ఇదే కాలంలో మొత్తం విక్రయాలు 5,66,213 (ఎగుమతులు 99,220)మాత్రమే. స్టాండలోన్ ప్రాతిపదికన కంపెనీ త్రైమాసిక నికర విక్రయాలు రూ.36,802 కోట్ల నుంచి రూ.47,534 కోట్లకు చేరాయి. నికర లాభం రూ.3,659 కోట్ల నుంచి రూ.3,794 కోట్లకు పెరిగింది.

# 2008 కంటే దారుణ పరిస్థితులు: ఏఐపై ఆర్థిక సర్వేలో హెచ్చరికలు

**సాంకేతిక రంగంలో కృత్రిమమేధ (Artificial intelligence) సంచలనాలు సృష్టిస్తోంది. దానిలో భారీ మార్పులు చోటు చేసుకుంటే.. 2008 ఆర్థిక సంక్షోభం కంటే దారుణమైన పరిస్థితులు ఎదురుకావొచ్చని ఆర్థికసర్వే (Economic Survey 2025-26) పేర్కొంది. భారత ఐటీ ఆధారిత వైట్ కాలర్ ఉద్యోగాలకు ప్రత్యక్ష ముప్పు ఉంటుందని హెచ్చరించింది. ఈ పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు 10 శాతం నుంచి 20 శాతం మేరే ఉండొచ్చని.. అయితే, దాని తాలూకూ ప్రభావం మాత్రం తీవ్ర స్థాయిలో ఉంటుందని వెల్లడించింది.**

"భారత్‌లో ఐటీరంగం వైట్‌కాలర్ ఉద్యోగాల్లో కీలకమైంది. ఏఐ ప్రవేశంతో ఈ రంగంపై తీవ్ర ప్రభావాలు ఉండొచ్చు. అయితే రాత్రికి రాత్రే ఈ ఉద్యోగాలు పోవు. కానీ ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. కొన్ని విభాగాల్లో ఉద్యోగాలను ఏఐ భర్తీ చేస్తోంది'' అని సర్వే (Latest Economic Survey) పేర్కొంది. విదేశీ సంస్థలకు భారత్ నుంచి తక్కువ వేతనంతో ఐటీ సేవలు అందుతున్నాయి. ఇప్పుడు అవే ప్రమాదంలో పడ్డాయి. ఆ పనులను ఏఐ వేగంగా, తక్కువ ఖర్చుతో చేస్తుండటం దెబ్బతీస్తోంది. ఇలాంటి పరిస్థితి నుంచి బయటపడేందుకు, ఉద్యోగాలను రక్షించుకునేలా మార్గనిర్దేశం చేసేందుకు ఏఐ ఎకనామిక్ కౌన్సిల్ ఉండాలని సర్వే ప్రతిపాదించింది. "అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ పోటీ పెరిగింది. ఐరోపాలో భద్రతాపరమైన పరిస్థితులు సంక్లిష్టంగా మారాయి. వాణిజ్య విధానాల విషయంలో రాజకీయ స్వలాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు'' అని సర్వే హెచ్చరించింది. సాంకేతికతపై అధిక పెట్టుబడుల కారణంగా పొంచి ఉన్న ఆర్థికపరమైన ముప్పును ప్రస్తావించింది. మరోపక్క బంగారం ధరలు 2025లో ఒక ఔన్సుకు 2,607 డాలర్ల నుంచి 4,315 డాలర్లకు పెరగడం.. డాలర్ బలహీనతను వెల్లడిచేస్తోంది. 2026లోనూ ఈ ధరల పెరుగుదల కొనసాగుతుంది. ఇవన్నీ మదుపర్లలో ఆందోళనను వెల్లడిచేస్తోందని పేర్కొంది. ఇక, ఏఐ వల్ల ఉత్పాదకత అమాంతం పెరిగిపోతుందనే ఆశతో పలు సంస్థలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ రంగంలో ఏదైనా దిద్దుబాటు చోటుచేసుకుంటే.. భారత్ వంటి మార్కెట్లలోకి వచ్చే పెట్టుబడులపై ప్రభావం పడొచ్చని తెలిపింది. ఈ పరిణామాలన్నింటితో భారత్‌కు ముప్పు ఉన్నప్పటికీ.. ఆర్థిక మూలాలు, విస్తృతమైన దేశీయ మార్కెట్, భారీగా ఉన్న విదేశీ మారక నిల్వలు బఫర్‌గా ఉండొచ్చనే అభిప్రాయాన్ని సర్వే వ్యక్తంచేసింది. పొంచి ఉన్న ప్రమాదాలను ఎదుర్కొనేలా దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకు వెళ్లాలని సూచించింది.




## గిగ్ వర్కర్ల సంపాదన రూ.15వేల కన్నా తక్కువే!

దేశంలో దాదాపు 40శాతం మంది గిగ్ వర్కర్లు (Gig Workers) నెలకు రూ.15వేల కన్నా తక్కువే సంపాదిస్తున్నారని ఆర్థిక సర్వే (Economic Survey) పేర్కొంది. ఈ వ్యవస్థలో గణనీయమైన, విధానపరమైన మార్పులు అవసరమని తెలిపింది. వారికి న్యాయమైన వేతనాలు అందించేందుకు వీలుగా వేచి ఉండే సమయానికి పరిహారంతో పాటు గంటకు లేదా ప్రతి పనికి కనీస ఆదాయం అందించాలని సూచించింది. నిబంధనల మార్పులే లక్ష్యంగా గిగ్-ఎకానమీ (Gig Economy) విధానం ఉండాలని పేర్కొంది.

గిగ్ ఎకానమీ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ.. ఆదాయంలో అస్థిరత ఓ కీలక సమస్యగా మిగిలిపోయిందని, ఇది రుణాలు పొందడంలో అడ్డంకులు సృష్టిస్తోందని ఆర్థిక సర్వే పేర్కొంది. దీంతో గిగ్ వర్కర్లు (Gig Workers) ఆర్థికంగా వెనకబడి ఉన్నారని, రుణాలు పొందే అవకాశాలు తక్కువగా ఉండటం వారిలో ఆందోళనలు పెంచుతోందని అభిప్రాయపడింది. గిగ్ వర్కర్లలో దాదాపు 40శాతం మంది నెలకు రూ.15వేల కన్నా తక్కువే (40% of Gig Workers Earn under ₹15,000 a Month) సంపాదిస్తున్నారని ఆర్థిక సర్వే అంచనా వేసింది. పరిమితమైన నైపుణ్యాలు, ఏఐ, మెషిన్ లెర్నింగ్ వంటి సాంకేతిక పురోగతి కారణంగా ఉద్యోగం కోల్పోయే నష్టాలు ఎక్కువయ్యాయని







# మా 'బంగారమే..' ప్రపంచవ్యాప్తంగా 5000 టన్నుల పసిడికి గిరాకీ..!




గతేడాది ప్రపంచవ్యాప్తంగా బంగారం డిమాండ్ ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరుకుంది. ప్రపంచ స్వర్ణ మండలి (WGC) నివేదిక ప్రకారం.. 2025లో మొత్తం బంగారం డిమాండ్ తొలిసారి ఐదు వేల టన్నులు దాటింది. 2024లో ఇది 4,961.9 టన్నులుగా ఉండగా.. 2025లో 5,002 టన్నులకు పెరిగింది. పెట్టుబడులకు సురక్షిత మార్గంగా భావించడం వంటివి డిమాండ్ పెరుగుదలకు కారణమైనట్లు తెలుస్తోంది. పెట్టుబడుల రూపేణా పసిడి డిమాండ్ 2024లో 1,185.4 టన్నులుగా ఉండగా.. గత ఏడాది 2,175.3 టన్నులకు పెరిగింది.

సెంట్రల్ బ్యాంకులు 2025లో 863 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేశాయి. నేషనల్ బ్యాంక్ ఆఫ్ పోలాండ్ అత్యధికంగా 102 టన్నులు కొనుగోలు చేసింది. రికార్డు స్థాయి ధరల నేపథ్యంలో గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఆభరణాల డిమాండ్ మందగించింది. 2024తో పోలిస్తే 18 శాతం తగ్గింది. కానీ, విలువపరంగా 18 శాతం పెరిగి 172 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

ఈ ఏడాది సైతం ఆర్థిక, భౌగోళిక రాజకీయ అస్థిరతలు తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించకపోవడంతో.. బంగారానికి డిమాండ్ కొనసాగే అవకాశం ఉందని డబ్ల్యూజీసీ సీనియర్ మార్కెట్స్ అనలిస్ట్ లూయిస్ స్ట్రీట్ తెలిపారు. 2026 మొదటి నెలలోనే బంగారం ధర ఔన్సుకు 5,000 డాలర్ల మార్కును దాటిందని, సురక్షిత పెట్టుబడిగా బంగారం పాత్రను ఇది చాటిచెబుతోందన్నారు.

**భారత్‌లో తగ్గిన డిమాండ్..**

భారత్‌లో మాత్రం గత ఏడాది పుత్తడికి డిమాండ్ తగ్గడం గమనార్హం. 2024లో ఇది మొత్తం 802.8 టన్నులుగా ఉండగా.. 2025లో 11 శాతం తగ్గిపోయి 710.9 టన్నులకు పడిపోయింది. రికార్డు స్థాయిలో ధరలు, మారుతున్న వినియోగదారుల కొనుగోలు విధానాలు దీనికి దారితీసినట్లు డబ్ల్యూజీసీ తన నివేదికలో తెలిపింది. అయితే, భారీగా పెరిగిన ధరల కారణంగా 2024లో బంగారం విక్రయాల విలువ రూ.5,75,930 కోట్ల నుంచి 30 శాతం పెరిగి 2025లో రూ.7,51,490 కోట్లకు చేరుకుంది. 2026లో దేశంలో బంగారం డిమాండ్ 600 700 టన్నులుగా ఉంటుందని డబ్ల్యూజీసీ అంచనా వేసింది.

స్వర్ణాభరణాల విషయంలోనూ గత ఏడాది దేశంలో డిమాండ్ తగ్గింది. 2024లో 563.4 టన్నులతో పోలిస్తే 24 శాతం తగ్గి 430.5 టన్నులకు చేరింది. అయితే, విలువ విషయంలో 2024లో నమోదైన రూ.4,04,510 కోట్లతో పోలిస్తే 12 శాతం పెరిగి రూ.4,54,390 కోట్లకు చేరుకుంది. డబ్ల్యూజీసీ గణాంకాల ప్రకారం.. 2024లో ఆర్బీఐ వద్ద 73 టన్నుల బంగారం నిల్వలు ఉండగా.. గత ఏడాది అదనంగా 4

## ఛార్జింగ్ కష్టాలకు చెక్.. 10,001 mAh బిగ్ బ్యాటరీ, క్రేజీ ధరతో రియల్‌మి కొత్త ఫోన్

మొబైల్ ఫోన్ ఛార్జింగ్ కష్టాలకు చెక్ పెట్టేలా రియల్‌మి సరికొత్త స్మార్ట్‌ఫోన్‌ను భారతీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. గత కొంతకాలంగా మొబైల్ కంపెనీలు బిగ్ బ్యాటరీ ఫోన్లను అందుబాటులోకి తీసుకొస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు వాటన్నింటినీ వెనక్కి నెట్టేలా తొలిసారి 10,001 mAh బ్యాటరీ సామర్థ్యంతో రియల్‌మి పీ4 పవర్ మోడల్‌ను విడుదల చేసింది. దీని ధర, ప్రత్యేకతలు ఏంటి?

realme P4 Power 5G specifications || రియల్‌మి పీ4 పవర్ 6.8 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ అమోలెడ్ 4డీ కర్వ్ డిస్‌ప్లేతో రానుంది. 144Hz రిఫ్రెష్ రేటు, 6500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, హెచ్‌డీఆర్ సపోర్ట్ ఉంటాయి. పెర్ఫామెన్స్ విషయానికొస్తే ఇందులో 2.6 గిగాహెడ్జ్ ఆక్టాకోర్ మీడియాటెక్ డైమెన్సిటీ 7400 అల్ట్రా ప్రాసెసర్ అమర్చారు. ఐపీ 68, ఐపీ 69, ఐపీ 66 రేటింగ్‌తో డస్ట్, వాటర్ రెసిస్టెన్స్ ఉంది.

realme P4 Power 5G camera || ఈ ఫోన్‌లో వెనుకవైపు డ్యుయల్ కెమెరా సెటప్ ఇచ్చారు. 50 ఎంపీ (సోనీ ఐఎంఎక్స్ 882 సెన్సర్) మెయిన్ కెమెరాతో వస్తున్న ఈ మొబైల్ ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌ను సపోర్ట్ చేస్తుంది. రెండోది 8 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా. ముందువైపు 16 ఎంపీ కెమెరా ఇచ్చారు. మెయిన్ కెమెరాతో 4కె, 30fpsలో వీడియోలను రికార్డు చేయొచ్చు. ఫ్రంట్ కెమెరా 1080p వరకే సపోర్ట్ చేస్తుంది. ఏఐ ఫీచర్‌తో రానున్న ఈ కెమెరాలు ఫొటోలకు అదనపు హంగులు ఇస్తాయి.

realme P4 Power 5G Battery || ఇక ఈ ఫోన్‌లో ప్రధాన హైలైట్ బ్యాటరీ. ఇప్పటి వరకూ ఇండియన్ మార్కెట్‌లో ఇంత పెద్ద బ్యాటరీతో ఏ మొబైలూ రాలేదు. 10,001 mAh టైటాన్ బ్యాటరీని రియల్‌మి ఇందులో అమర్చింది. నెక్స్ట్ జనరేషన్ సిలికాన్ కార్బన్ ఆండో టెక్, డ్యుయల్ లేయర్ కోటింగ్ ప్రాసెస్, సిప్యాక్ ప్రొటెక్షన్ బోర్డ్ వంటి కీ ఫీచర్లు జోడించి భద్రత ప్రమాణాలున్న బ్యాటరీని తీసుకొచ్చింది. వీటి వల్ల ప్రస్తుత మొబైల్ ఫోన్ బ్యాటరీలతో పోలిస్తే, 30 శాతం అదనపు జీవితకాలం రావడంతో పాటు, ఎలాంటి ఇబ్బందుల లేకుండా పవర్ డెలివరీ అవుతుంది. 8 ఏళ్ల పాటు పనిచేసేలా బ్యాటరీని తీర్చిదిద్దినట్లు రియల్‌మి చెబుతోంది. నాలుగేళ్ల పాటు హెల్దీ బ్యాటరీ వారెంటీని అందిస్తోంది. ఒకవేళ ఈ సమయంలో 80 శాతం కన్నా తక్కువ సామర్థ్యానికి బ్యాటరీ పడిపోతే, ఉచితంగా రీప్లేస్ చేయనున్నట్లు హామీ ఇచ్చింది. (ఫస్ట్ సేల్‌లో కొన్నవారికి మాత్రమే ఈ అవకాశం) బాక్స్‌లో 80W సూపర్ వూక్ ఛార్జర్‌ను ఇస్తున్నారు. 36 నిమిషాల్లో 50 శాతం మొబైల్ ఛార్జ్ అవుతుంది. కేవలం 5 నిమిషాలు ఛార్జింగ్ పెడితే హాఫ్ డే వాడుకోవచ్చని కంపెనీ చెబుతోంది. 27w రివర్స్ ఛార్జ్ ఆప్షన్ ద్వారా ఇతర డివైజ్‌లను ఛార్జ్ చేసుకోవచ్చు.

realme P4 Power price in india || ఫోన్ ధర విషయానికొస్తే... ఇది మూడు వేరియంట్లలో లభిస్తోంది. 8 జీబీ+ 128 జీబీ వేరియంట్ ధర రూ.25,999. 8 జీబీ+ 256 జీబీ వేరియంట్ ధర రూ.27,999. హైఎండ్ వేరియంట్ 12 జీబీ+ 256 జీబీ వేరియంట్ రూ.30,999. రియల్‌మి యూఐ 7.0 ఆధారిత ఆండ్రాయిడ్ 16తో రానున్న ఈ మొబైల్‌కు మూడేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, 4 ఏళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇవ్వనున్నారు. ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ కార్డులతో కొనుగోళ్లపై రూ.2 వేలు అదనపు డిస్కౌంట్ పొందొచ్చు. లేదా ఎక్స్ఛేంజ్ బోనస్ రూ.2 వేలు లభిస్తుంది. ఫిబ్రవరి 5 నుంచి realme.com, Flipkart వెబ్‌సైట్స్ ద్వారా ఈ మొబైల్ కొనుగోలు చేయొచ్చు.




## ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు..
# జంక్‌ఫుడ్ ప్రచారాన్ని నిషేధించాలి..!

దిల్లీ: అధిక కొవ్వు, చక్కెర కలిగిన అత్యంత ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల వినియోగంపై ఆందోళనలు వ్యక్తమవుతోన్న వేళ కేంద్ర ఆర్థిక సర్వే కీలక సూచన చేసింది. ఉదయం 6 గంటల నుంచి అర్ధ రాత్రి 11 గంటల వరకు జంక్ ఫుడ్ ప్రకటనలపై నిషేధం విధించే (Ban Advertising of Ultra Processed Foods) అవకాశాలను పరిశీలించాలని పేర్కొంది. అలాగే చిన్నారులు, పసిపిల్లల పాల ఉత్పత్తులు, పానీయాల మార్కెటింగ్‌పైనా ఆంక్షలు విధించాలని పిలుపునిచ్చింది.

202526 ఆర్థిక సంవత్సరాని (Economic Survey 202526)కి సంబంధించిన ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ (Nirmala Sitharaman) గురువారం పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెట్టారు. ఈ సర్వేలో అత్యంత ప్రాసెస్ చేసిన ఆహార వినియోగాన్ని తగ్గించే అంశాలపై ప్రస్తావించారు. జంక్‌ఫుడ్‌గా పిలిచే బర్గర్, నూడుల్స్, పిజ్జా, సాఫ్ట్ డ్రింక్ వంటి పదార్థాల కారణంగా దీర్ఘకాల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్న విషయాన్ని గుర్తుచేశారు.

"మన దేశంలో 2009 నుంచి 2023 మధ్య జంక్ ఫుడ్ వినియోగం 150శాతానికి పైగా పెరిగింది. అత్యంత ప్రాసెస్ (Ultra Processed Foods) చేసిన ఆహార పదార్థాల రిటైల్ విక్రయాలు విలువ 2006లో 0.9 బిలియన్ డాలర్లు ఉండగా.. 2019 నాటికి అది 38 బిలియన్ డాలర్లకు (40 రెట్లు) పెరిగింది. మహిళలు, పురుషుల్లో ఒబెసిటీ సమస్య దాదాపు రెట్టింపు అయ్యింది. ఏ ఒక్క వినియోగదారుడో తన అలవాట్లను మార్చుకుని సమతుల్య ఆహారం తీసుకున్న మాత్రాన.. ఆరోగ్య భారత్ సాధ్యం కాదు. ఆహార వ్యవస్థలకు సంబంధించి పాలనపరమైన విధానాల్లోనూ మార్పులు రావాలి. జంక్ ఫుడ్ ఉత్పత్తి, మార్కెటింగ్‌ను నియంత్రించాలి'' అని ఆర్థిక సర్వే (Latest Economic Survey) పేర్కొంది.

ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 11 గంటల వరకు అన్ని ప్రసార మాధ్యమాల్లో జంక్ ఫుడ్ ప్రకటనలపై నిషేధం విధించే (Economic Survey 2026 Bans Junk Food Marketing) అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సర్వే సూచించింది. అలాగే, జంక్ ఫుడ్ ఉత్పత్తులపై అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు ఎంత వినియోగించారో హెచ్చరించేలా న్యూట్రిషన్ లేబుల్‌ను ముద్రించాలని సూచించింది.



## పోరాట యోధుడు



1897 నుంచి 1920 మధ్య సాగిన బ్రిటిష్ పాలనా కాలం నేపథ్యంగా 'డేవిడ్ రెడ్డి' సినిమా రూపొందుతోంది. బ్రిటిష్ క్రూర పాలనకు ఎదురు నిలిచి పోరాడిన యోధుడు డేవిడ్ రెడ్డి పాత్రను మంచు మనోజ్ పోషిస్తున్నారు. ఈ పాన్ ఇండియా పీరియాడిక్ మూవీని నల్లగంగుల వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు.

హనుమ రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తున్నారు. మారియా ర్యబోషప్క హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. "మనోజ్ తన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, లుక్, పర్‌ఫార్మెన్స్‌తో డేవిడ్ రెడ్డి పాత్రలో ఒదిగిపోతున్నారు" అని యూనిట్ పేర్కొంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, కెమెరా: ఆచార్య వేణు.

## డబ్బు కోసమే తప్పుడు వార్తలు రాస్తున్నారు: రష్మిక



**మనుషుల మనో భావాలు రకరకాలుగా ఉంటాయి. ఇక సినీ తారల అభిప్రాయలు సందర్భానుసారంగా ఉంటాయని చెప్పవచ్చు. కొందరు తమపై వచ్చే విమర్శలను స్వాగతిస్తున్నామంటారు. మరి కొందరు వదంతులను ఎంజాయ్ చేస్తున్నామంటారు. ఇంకొందరు సీరియస్‌గా రియాక్ట్ అవుతుంటారు. ఇందుకు మన కథానాయకిలు అతీతంగా కాదు. అలా నటి రష్మిక మందన్నా(Rashmika Mandanna) కూడా వదంతులపై స్పందించారు. ఈ కన్నడ బ్యూటీ మాతృభాషలో నటించిన తొలి చిత్రం తరువాత నుంచే వివాదాల్లో చిక్కుకున్నారనే చెప్పాలి. ఆ తరువాత కూడా తన వివాదాస్పద వ్యాఖ్యలతో విమర్శలకు గురయ్యారు. ఆ తరువాత ప్రేమ వ్యవహారంలో వైరల్ అయ్యారు.**

విషయం ఏమిటంటే ఇవేవీ ఈ భామ కెరీర్‌కు ఎఫెక్ట్ అవ్వలేదు. అదే సమయంలో అవన్నీ ఈమెకు ప్లస్ అయ్యాయనే చెప్పాలి. అందుకే శాండిల్ వుడ్ వైయా టాలీవుడ్, కోలీవుడ్‌లోనూ దాటి బాలీవుడ్‌లోనూ వరుస విజయాలను సాధిస్తూ నేషనల్ క్రష్‌గా వెలిగిపోతున్నారు. ప్రస్తుతం తెలుగులో రెండు చిత్రాలతో పాటూ హిందీలోనూ నటిస్తూ బిజీగా ఉన్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో తన గురించి వైరల్ అవుతున్న రకరకాల ట్రోలింగ్స్‌పై స్పందించిన రష్మిక మందన్నా అసత్య ప్రచారాలపై ఎందుకు వివరణ ఇవ్వాలని ప్రశ్నించారు. అలాంటి విషయాలపై స్పందిస్తే వారిని ప్రోత్సహించినట్లే అవుతుందన్నారు. కొందరు డబ్బు కోసమే అలాంటి నిరాధారమైన వార్తలు రాస్తున్నారని అన్నారు. అలాంటి ముఖం తెలియని వారికి వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. తాను ఎప్పుడూ ఒకేలా ఉంటున్నానని నటి రష్మిక మందన్నా పేర్కొన్నారు.

## 'యంగ్ టైగర్' ట్యాగ్ ఎవరూ వాడొద్దు..
# ఎన్టీఆర్‌కు కోర్టు రక్షణ



**జూనియర్ ఎన్టీఆర్ హక్కులకు రక్షణగా ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు**

ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌కు సంబంధించిన ప్రైవసీ హక్కులను కాపాడాతూ ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తన ప్రమేయం లేకుండా సోషల్ మీడియాలో కొందరు వ్యక్తులు తన హక్కులకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నారని ఎన్టీఆర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ అంశంలో తారక్‌కు అనుకూలంగా కోర్టు తీర్పు చెప్పింది. తన అనుమతి లేకుండా ఎన్టీఆర్ పేరుతో పాటు ఆయన ఫోటోలను వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకోవడం నేరమని కోర్టు తెలిపింది. దీనివల్ల ఆయన హక్కులకు భంగం కలుగుతోందని కోర్టు అభిప్రాయపడింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని, హైకోర్టు ఆయన వ్యక్తిత్వ హక్కులకు రక్షణ కల్పించిందిఅనే నిక్ నేమ్‌స్‌ను ఎవరూ ఉపయోగించరాదని కోర్టు సూచించింది. వాణిజ్యపరంగా ఆయన అనుమతి లేకుండా ఎవరైనా ఈ పేర్లను ఉపయోగించి ఉంటే చట్ట ప్రకారం తొలగించాలని కోర్టు ఆదేశించింది.దేశంలో జూనియర్ ఎన్టీఆర్ అందరికీ సుపరిచిత నటుడని కోర్టు తెలిపింది. భారతదేశంలో ఎంతో ఉన్నత హోదాను కలిగి ఉన్నారని గుర్తు చేసింది. తన విజయవంతమైన కెరీర్‌లో అపారమైన ఖ్యాతిని పొందారని స్పష్టంగా గుర్తించింది. దీంతో ఆయన ప్రైవసీ హక్కులను రక్షించకపోతే ఆయనకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చాలా స్పష్టంగా కోర్టు పేర్కొంది.ఆన్‌లైన్ సంస్థలతోపాటు జాన్ డో లాంటి వ్యక్తులను (ఊరూపేరూ లేకుండా సెలబ్రిటీల పేర్లను దుర్వినియోగం చేసేవారు) ఆయన పేరు, చిత్రాలను వాడకుండా నిషేధించింది. ఎన్టీఆర్ ఫోటోలను మార్ఫింగ్ చేసినా.. ఆయన పేరును దుర్వినియోగం చేసినా నేరం కిందకు వస్తుందని కోర్టు హెచ్చరించింది.

## 'జన నాయగన్'ను ఇబ్బంది పెడుతున్న సీన్లు ఏంటి.. కాశ్మీర్ ఫైల్స్‌కు సెన్సార్ ఎలా?

జన నాయగన్ చిత్రం ఇప్పుడు మరింత వివాదాంశంగా మారుతోంది. నటుడు విజయ్ కథానాయకుడిగా నటించిన ఈ మూవీని హెచ్.వినోద్ దర్శకత్వంలో కేవీఎన్ సంస్థ భారీ బడ్జెట్ తో తెరకెక్కించింది. సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అయితే సెన్సార్ సమస్యలు తలెత్తడంతో సెన్సార్‌బోర్డు, కోర్టుల్లో ఈ చిత్రం నానుతోంది. చిత్రంలో పలు వివాదాస్పద సన్నివేశాలు చోటు చేసుకోవడంతో చిత్రాన్ని రివైజింగ్ కమిటీకి పంపినట్లు సెన్సార్‌బోర్డు అధికారులు పేర్కొన్నారు. దీంతో చిత్ర నిర్మాత మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన హైకోర్టు సింగిల్ బెంచ్ న్యాయమూర్తి ఆషా.. జననాయగన్ చిత్రానికి వెంటనే సర్టిఫికెట్ అందించాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ ఉత్తర్వులను వ్యతికేకిస్తూ సెన్సార్‌బోర్డు అధికారులు మద్రాసు హైకోర్టులో రిట్ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో ఉండగానే చిత్ర నిర్మాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాగా ఈ కేసును విచారించడంలో తమకు ఆసక్తిలేదని, మద్రాసు హైకోర్టులోనే తేల్చుకోవలసిందిగా సుప్రీంకోర్టు ఆదేశించింది.


జన నాయగన్‌లో ఉన్న అభ్యంతరాలు ఇవే

జన నాయగన్ చిత్ర వ్యవహారంలో మద్రాసు హైకోర్టు ఆసక్తికరమైన ఆదేశాలను జారీ చేసింది. జన నాయగన్ చిత్రంలో మత విభేదాలకు ఆస్కారం కలిగించే సన్నివేశాలు చోటు చేసుకున్నాయని, కొన్ని విదేశీ శక్తులు మన దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్ర చేసినట్లు చిత్రీకరించిన సన్నివేశాలను అంగీకరించబోమని సెన్సార్ బోర్డు సభ్యులు తెలిపారు. అందుకే 9 మంది సభ్యుల రివైజింగ్ కమిటీకి పంపాలని నిర్ణయించారు. భద్రతా దళాలకు సంబంధించిన చాలా సీన్లు ఉండడం ఒక కారణమైతే.. మొదట ఈ సినిమాను చూసిన కమిటీలో నిపుణులు లేకపోవడం వల్ల మరో సమస్యకు దారి తీసింది. దీంతో మరోసారి రివైజింగ్‌కు పంపేందుకు సెన్సార్ నిర్ణయం తీసుకుంది. రివైజింగ్ కమిటీ తర్వాత సెన్సార్ వస్తుందని ప్రకటించారు. కానీ, ఇక్కడే ఆలస్యం జరుగుతుంది. చిత్ర నిర్మాతలకు సరైన తేదీ వారు చెప్పకపోవడంతో సినిమా ఎప్పుడు విడుదల కానుందో ఎవరికీ సరైన క్లారిటీ లేదు. సెన్సార్ బోర్డు అధికారులు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణలో ఉండగానే చిత్ర నిర్మాతలు ఎలాంటి వివరణ ఇవ్వకుండా సెన్సార్ సర్టిఫికెట్‌ను కోరడం సముచితం కాదని మద్రాస్ కోర్టు సూచించింది.

సెన్సార్ బోర్డే అవసరం లేదు

నటుడు మన్సూర్ అలీఖాన్ సెన్సార్ బోర్డుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈయన చెన్నైలో జరిగిన ఒక సినిమా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ నటించిన జననాయగన్ చిత్రానికి సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. సెన్సార్ బోర్డు వివక్షత ధోరణికి పాల్పడుతోందని విమర్శించారు. కాశ్మీర్ ఫైల్స్, కేరళా స్టోరీ వంటి వివాదాస్పద చిత్రాలకు సర్టిఫికెట్ ఇచ్చిన సెన్సార్‌బోర్డు జననాయగన్ చిత్రానికి ఇవ్వడానికి ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో సెన్సార్ బోర్డే అవసరం లేదని అన్నారు. సెన్సార్ బోర్డు కేంద్ర ప్రభుత్వం ఆదీనంలో కాకుండా,సినిమాకు చెందిన మధ్యవర్తులతో కూడిన కమిటీగా ఉండాలన్నారు.








## నేనే హీరో, నేనే విలన్.. 'యానిమల్ పార్క్' అప్పుడే మొదలు: రణ్‌బీర్ కపూర్

హిట్ మూవీ 'యానిమల్'కు సీక్వెల్‌గా 'యానిమల్ పార్క్' (Animal Park)ను ఎప్పుడో ప్రకటించిన సంగతి తెలిసిందే. 'యానిమల్' వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటికీ సీక్వెల్ సినిమా పట్టాలెక్కలేదు. దానికి గల కారణం, ఈ మూవీ ఎప్పుడు ప్రారంభమవుతుందన్న వివరాలను ఓ ఇంటర్వ్యూలో హీరో రణ్‌బీర్ కపూర్ (Ranbir Kapoor) పంచుకున్నారు. దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా మరో సినిమా పనుల్లో బిజీగా ఉన్నారని, అందుకే 'యానిమల్ పార్క్' ఆలస్యమవుతోందన్నారు. 2027లో షూటింగ్ ప్రారంభిస్తామని చెప్పారు. ఇందులో తాను హీరోగా, విలన్‌గా నటించనున్నానని తెలిపారు. అందుకే ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానన్నారు. ఈ కథను ఎలా ముందుకు తీసుకెళ్లాలి? అని తొలి సినిమా నుంచే తామిరువురు చర్చించుకుంటున్నామని పేర్కొన్నారు. 'యానిమల్' ఫ్రాంచైజీలో మూడు సినిమాలుంటాయని స్పష్టం చేశారు.

ప్రస్తుతం 'స్పిరిట్' (Spirit)ను రూపొందిస్తున్నారు సందీప్‌రెడ్డి. ప్రభాస్ (Prabhas) హీరోగా తెరకెక్కుతున్న యాక్షన్ మూవీ ఇది. ప్రభాస్ తన కెరీర్‌లో తొలిసారి పోలీసు అధికారిగా నటిస్తున్నారు. రణ్‌బీర్ విషయానికొస్తే.. 'లవ్ అండ్ వార్', 'రామాయణ' (Ramayana) చిత్రాల్లో యాక్ట్ చేస్తున్నారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో 'రామాయణ' రెండు భాగాలుగా రానుంది. తొలి భాగం 2026 దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్నాయి.

## గణ గుణాలు తెలిపేలా...



గణ గుణాలేంటి? అతను తీరేంటి? అంటే 'రైజ్ ఆఫ్ గణ' పాట వినాల్సిందే. గణ పాత్రలో సుడిగాలి సుధీర్ హీరోగా నటించిన చిత్రం 'గోట్'. దివ్యభారతి హీరోయిన్‌గా నటించారు. వేదవ్యాస్ దర్శకత్వంలో మహాతేజ క్రియేషన్స్, జైష్ణవ్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత.ఈ చిత్రం ఫిబ్రవరిలో విడుదల కానుంది. సోమవారం ఈ చిత్రం నుంచి 'రైజ్ ఆఫ్ గణ' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. లియోన్ జేమ్స్ సంగీతం అందించిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. "హీరో క్యారెక్టరైజేషన్, అతని గుణాలు, తీరు తెలిపే విధంగా పవర్‌ఫుల్ సాంగ్‌లా ఉంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది" అని నిర్మాత అన్నారు.

## 'ది రాజాసాబ్' రిజల్ట్.. రాబోయే తుఫాన్ గురించి హెచ్చరిస్తున్న ఫ్యాన్స్

ది రాజాసాబ్" మూవీకి బాక్సాఫీస్ వద్ద సరైన ఫలితం దక్కకపోవడంతో ప్రభాస్‌పై ట్రోలింగ్ మొదలైంది. పాన్ ఇండియా రేంజ్ హీరో మార్కెట్ ఇంతేనా అంటూ కొందరు కామెంట్లు చేశారు. అయితే, వాటిని డార్లింగ్ ఫ్యాన్స్ బలంగానే తిప్పికొడుతున్నారు. తెలుగు పరిశ్రమ కీర్తిని పాన్ ఇండియాకు పరిచయం చేసిందే ప్రభాస్ అంటూ కౌంటర్ ఇస్తున్నారు. ఇప్పటికీ బాహుబలి కలెక్షన్స్ రికార్డ్స్ పదిలంగానే ఉన్నాయని వారు గుర్తుచేస్తున్నారు. ఒక్క సినిమాతో డార్లింగ్ క్రేజ్ ఏంతమాత్రం తగ్గదని అంతే రేంజ్‌లో విరుచుకుపడుతూనే రాబోయే కలెక్షన్ల తుఫాన్ గురించి హెచ్చరిస్తున్నారు. తమ అభిమాన హీరో ఫుల్లీ లోడెడ్ గన్స్‌తో రానున్నాడని హెచ్చరిస్తున్నారు.

"ది రాజాసాబ్" మూవీ ఫలితం వల్ల ప్రభాస్ ఫ్యాన్స్ కాస్త నిరాశ చెందిన విషయం వాస్తవమే.. దీనిని ప్రభాస్ కూడా గుర్తించినట్లు ఉన్నారు. అందుకే తను కీలక నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. తన ఫ్యాన్స్‌ను మళ్లీ సంతోషపెట్టేందుకు వరుస ప్రాజెక్ట్‌లను లైన్‌లో పెట్టేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఫౌజీ, స్పిరిట్ సినిమాలతో పాటు కల్కి సీక్వెల్‌ను కూడా లైన్‌లో పెట్టారు. ఇవన్నీ కూడా పాన్ ఇండియా స్థాయిలో రానున్న విషయం తెలిసిందే. ఏడాది గ్యాప్‌లోనే ప్రభాస్ నుంచి రెండు సినిమాలు విడుదల చేయాలని బలంగా ఉన్నారట. అయితే, మొదటగా ఫౌజీ రానుంది. ఆ తర్వాత స్పిరిట్ లైన్‌లో ఉంది. ఈ రెండు చిత్రాల్లో ప్రభాస్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండనుంది. పాన్ ఇండియాను షేక్ చేసే స్థాయిలో ఈ సినిమాలు ఉంటాయని ఇండస్ట్రీ అంచనా వేస్తుంది. ఆపై కల్కి రంగంలోకి రానుంది. ఇలా బిగ్ ప్రాజెక్ట్స్ వస్తుండటంతో ప్రభాస్ మార్కెట్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదనేది సినీ విశ్లేషకుల మాట.. రాజాసాబ్ కలెక్షన్స్ నిరాశ పరిచినా.. ప్రభాస్ మార్కెట్ ఎట్టిపరిస్థితిల్లోనూ తగ్గిపోలేదు. అతని స్టార్ పవర్ ఇంకా బలంగానే ఉంది. రాబోయే స్పిరిట్ సినిమా ప్రభాస్ కెరీర్‌లోనే అతిపెద్ద మార్కెట్‌ను క్రియేట్ చేసే ఛాన్స్ ఉంది. ప్రభాస్‌కు పాన్ ఇండియా స్థాయిలో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అదీ ఒక ఫ్లాప్‌తో అది తగ్గిపోదు. రాజా సాబ్‌కు నష్టాలు రావడంతో తన రెమ్యూనరేషన్‌లో 40% తగ్గించుకున్నారని సమాచారం ఉంది. ఆపై స్పిరిట్ మూవీ పంపిణీ హక్కులను కూడా ఆ మూవీ నిర్మాతకు అందేలా ప్రభాస్ చేయడం విశేషం. 'రాజాసాబ్' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా మళ్లీ తన సినిమాలను వరుసగా బాక్సాఫీస్ వద్దకు తీసుకురావాలని డార్లింగ్ కూడా ఫుల్ క్లారిటీతో ఉన్నారట.



## యూపీ వారియర్స్ చిత్తు.. ఫైనల్‌కు దూసుకెళ్లిన ఆర్సీబీ



డబ్ల్యూపీఎల్ 2026 (WPL)లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫైనల్‌కు దూసుకెళ్లింది. యూపీ వారియర్స్‌తో జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ఆర్సీబీ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఎనిమిది మ్యాచ్‌ల్లో ఆరో విజయం అందుకున్న బెంగళూరు 12 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. మరే జట్టు 12 పాయింట్లు సాధించే అవకాశం లేకపోవడంతో ఆర్సీబీ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. యూపీ నిర్దేశించిన 144 పరుగుల లక్ష్యాన్ని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 13.1 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. గ్రేస్ హారిస్ (75; 37 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) బౌండరీల మోత మోగించింది. స్మృతి మంధాన (54*; 27 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా అర్ధ శతకంతో విరుచుకుపడింది. జార్జియా వోల్ (16) పరుగులు చేసింది. బెంగళూరు ఫైనల్‌కు వెళ్లడం ఇది రెండోసారి. 2024లో ఆ జట్టు ఛాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. దీప్తి శర్మ (55; 43 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), మెగ్ లానింగ్ (41; 30 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 74 పరుగులు జోడించింది. మిగతా బ్యాటర్లు పెద్ద స్కోర్లు చేయలేకపోయారు. హర్లీన్ డియోల్ (14), సిమ్రాన్ షేక్ (10) రన్స్ చేయగా.. అమీ జోన్స్ (1), క్లో ట్రయాన్ (6), శ్వేతా సెహ్రావత్ (7) విఫలమయ్యారు. ఆర్సీబీ బౌలర్లలో నదైన్ డి క్లెర్క్ 4, గ్రేస్ హారిస్ 2, శ్రేయాంక పాటిల్, లారెన్ బెల్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# ఆర్సీబీదే తొలి అడుగు

**–యూపీపై విజయంతో ఫైనల్‌కు**
**–గ్రేస్ ఆల్‌రౌండ్ జోరు**



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరోసారి అదరగొట్టింది. స్మృతి మంధాన నేతృత్వంలోని ఆ జట్టు డబ్ల్యూపీఎల్ 4లో ఫైనల్ చేరిన తొలి జట్టయింది. గ్రేస్ హారిస్ ఆల్‌రౌండ్ సత్తా చాటిన వేళ.. యూపీ వారియర్స్‌ను ఆర్సీబీ చిత్తుగా ఓడించింది. లీగ్ దశలో తన ఎనిమిది మ్యాచ్‌లనూ ఆడేసిన ఆర్సీబీ, ఆరు విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని ఖాయం చేసుకుంది. అయిదో ఓటమి చవిచూసిన యూపీ ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించినట్లే!

మాజీ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు డబ్ల్యూపీఎల్ ఫైనల్లోకి ప్రవేశించింది. గురువారం అత్యంత ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో బెంగళూరు 8 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై ఘనవిజయం సాధించింది. నదైన్ డిక్లెర్క్ (4/22), గ్రేస్ హారిస్ (2/22) ధాటికి మొదట యూపీ వారియర్స్ 8 వికెట్లకు 143 పరుగులే చేయగలిగింది. లారెన్ బెల్ (1/21), శ్రేయాంక పాటిల్ (1/27) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. దీప్తి శర్మ (55; 43 బంతుల్లో 6×4, 1×6) టాప్ స్కోరర్‌గా నిలిచింది. మెగ్ లానింగ్ (41; 30 బంతుల్లో 6×4, 1×6) రాణించింది. ఓపెనర్లు గ్రేస్ హారిస్ (75; 37 బంతుల్లో 13×4, 2×6), స్మృతి మంధాన (54 నాటౌట్; 27 బంతుల్లో 8×4, 2×6) విధ్వంసం సృష్టించడంతో లక్ష్యాన్ని ఆర్సీబీ 13.1 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి అలవోకగా ఛేదించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన గ్రేస్ హారిస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. అగ్రస్థానం ఖాయం కావడంతో బెంగళూరు (12 పాయింట్లు) ఫైనల్లో అడుగు పెట్టింది. డబ్ల్యూపీఎల్‌లో లీగ్ దశ ముగిసే సరికి పాయింట్ల పట్టికలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. అగ్రస్థానం సాధించిన జట్టు నేరుగా ఫైనల్‌కు వెళ్తుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్‌లో తలపడతాయి. అందులో గెలిచిన జట్టు ఫైనల్ చేరుతుంది. గుజరాత్ (8 పాయింట్లు), ముంబయి ఇండియన్స్ (6), దిల్లీ క్యాపిటల్స్ (6), యూపీ (4) ఒక్కో మ్యాచ్ ఆడాల్సి ఉంది.



**ఆర్సీబీ అలవోకగా..:** గ్రేస్ హారిస్ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఆర్సీబీ లక్ష్యం మరింత చిన్నదైపోయింది. ఎడాపెడా బౌండరీలు బాదేసిన ఆమె.. స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. క్రాంతి గౌడ్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లో రెండు బంతులను బౌండరీ దాటించిన గ్రేస్.. ఆ తర్వాత ఏ దశలోనూ తగ్గలేదు. విధ్వంసాన్ని పెంచుకుంటూ పోయింది. క్రాంతి తర్వాతి ఓవర్లో ఏకంగా నాలుగు బౌండరీలు బాదింది. ఆశా బౌలింగ్‌లో సిక్స్‌తో అర్ధశతకం (28 బంతుల్లో) పూర్తి చేసింది. 7 ఓవర్లకు ఆర్సీబీ స్కోరు 79 కాగా.. అందులో గ్రేస్ చేసినవే 64 పరుగులు. ఎదుర్కొన్న తొలి 11 బంతుల్లో 13 పరుగులు చేసిన మరో ఓపెనర్ స్మృతి కూడా క్రమంగా జోరు పెంచింది. చకచకా ఫోర్లు కొట్టింది. 10వ ఓవర్లో జట్టు స్కోరు 108 వద్ద గ్రేస్ నిష్క్రమించినా.. వారియర్స్‌కు సంతోషించడానికేమీ లేకపోయింది. అప్పటికే బెంగళూరు విజయం ఖాయమైంది. ధాటైన బ్యాటింగ్‌ను కొనసాగించిన స్మృతి.. అలవోకగా పని పూర్తి చేసింది. 26 బంతుల్లోనే ఆమె అర్ధశతకాన్నందుకుంది. వోల్ (16)తో రెండో వికెట్‌కు స్మృతి 35 పరుగులు జోడించింది.

**వారియర్స్ కట్టడి......:** నదైన్ డిక్లెర్క్‌తో పాటు ఇతర బౌలర్లు సూపర్‌గా బౌలింగ్ చేయడంతో మొదట యూపీ వారియర్స్‌కు బెంగళూరు కళ్లెం వేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూపీ.. అదిరే ఆరంభాన్ని వృథా చేసుకుంది. ఈ మ్యాచ్‌లో దీప్తి ఓపెనర్‌గా వచ్చింది. లానింగ్‌తో కలిసి యూపీ ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఆమె.. బెల్ ఓవర్లో ఓ ఫోర్, సిక్స్ బాదింది. లానింగ్ మరింత దూకుడుగా బ్యాటింగ్ చేసింది. సయాలి బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ కొట్టిన ఆమె.. అరుంధతి ఓవర్లో మూడు ఫోర్లు అందుకుంది. ఓపెనర్ల దూకుడుతో 8 ఓవర్లు ముగిసే సరికి 74/0తో యూపీ భారీ స్కోరుపై కన్నేసింది. కానీ ఆ జట్టు అనూహ్యంగా తడబడింది. లానింగ్‌ను ఔట్ చేయడం ద్వారా తొలి వికెట్ భాగస్వామ్యాన్ని నదైన్ విడదీయడంతో యూపీ ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. ఆ తర్వాత బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. గ్రేస్ కూడా విజృంభించడంతో యూపీ చకచకా వికెట్లు కోల్పోయింది. ఓ వైపు దీప్తి నిలిచినా.. ఆమెకు సహకరించే వారే కరవయ్యారు. అమీ జోన్స్ (1), హర్లీన్ డియోల్ (14), క్లో ట్రయాన్ (6), శ్వేత సెహ్రావత్ (7) విఫలమయ్యారు. దీప్తి 19వ ఓవర్లో నిష్క్రమించింది. ఆఖరి ఓవర్లో సోఫీ ఎకిల్‌స్టోన్ (0), సిమ్రన్ షేక్ (10)ను నదైన్ వెనక్కి పంపింది. యూపీ తన చివరి 8 వికెట్లను 48 పరుగుల వ్యవధిలో కోల్పోయింది.

**యూపీ వారియర్స్ ఇన్నింగ్స్:** లానింగ్ (సి) రాధ యాదవ్ (బి) నదైన్ 41; దీప్తి శర్మ (సి) నదైన్ (బి) శ్రేయాంక 55; అమీ జోన్స్ ఎల్బీ (బి) నదైన్ 1; హర్లీన్ డియోల్ (బి) హారిస్ 14; క్లో ట్రయాన్ (స్టంప్డ్) రిచా (బి) గ్రేస్ 6; శ్వేత సెహ్రావత్ (సి) స్మృతి (బి) బెల్ 7; సిమ్రన్ షేక్ (సి) అరుంధతి రెడ్డి (బి) నదైన్ 10; సోఫీ ఎకిల్‌స్టోన్ ఎల్బీ (బి) నదైన్ 0; ఆశా శోభన నాటౌట్ 0; శిఖ పాండే నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 143; వికెట్ల పతనం: 174, 278, 395, 4103, 5122, 6137, 7138, 8143; బౌలింగ్: లారెన్ బెల్ 40211; సయాలి 20210; శ్రేయాంక పాటిల్ 40271; అరుంధతి రెడ్డి 10140; నదైన్ డిక్లెర్క్ 40224; గ్రేస్ హారిస్ 30222; రాధ యాదవ్ 20110

**బెంగళూరు ఇన్నింగ్స్:** గ్రేస్ హారిస్ (బి) శిఖ పాండే 75; స్మృతి మంధాన నాటౌట్ 54; జార్జియా వోల్ (సి) సిమ్రన్ షేక్ (బి) శోభన 16; రిచా ఘోష్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 2 మొత్తం: (13.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి) 147; వికెట్ల పతనం: 1108, 2143; బౌలింగ్: క్రాంతి గౌడ్ 20290; శిఖ పాండే 40361; దీప్తి శర్మ 2.10280; సోఫీ ఎకిల్‌స్టోన్ 20140; ఆశా శోభన 20241; క్లో ట్రయాన్ 10150

## రెండో సీడ్‌కు ఇషారాణి షాక్



భారత యువ షట్లర్ ఇషారాణి బారువా.. థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో రెండో సీడ్ సంగ్ షువో యున్ (దక్షిణ కొరియా)కు షాకిచ్చి క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఆమె 2113, 1421, 2114తో సంగ్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో దేవిక షగ్ 2114, 2114తో చైనీస్ తైపీ అమ్మాయి టుంగ్ టాంగ్‌పై విజయం సాధించి క్వార్టర్స్‌లో అడుగు పెట్టింది. హోరాహోరీగా సాగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో తరుణ్ మన్నెపల్లి 2117, 1421, 2422తో టింగ్ యెన్ (చైనీస్ తైపీ)ని ఓడించాడు. కిరణ్ జార్జ్ 1621, 1121తో బగాస్ షుజివో (ఇండొనేసియా) చేతిలో, మిథున్ మంజునాథ్ 2111, 1621, 1221తో లీ జియా (మలేసియా) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు.

## తోకముడిచిన పాకిస్థాన్!

**–టీ20 ప్రపంచకప్ కోసం**
**2న శ్రీలంకకు**

పాకిస్థాన్ వెనక్కి తగ్గినట్లే. టీ20 ప్రపంచకప్ కోసం ఆ జట్టు శ్రీలంకకు వెళ్లబోతోంది. ఈ మేరకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు షెడ్యూల్ కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. ఫిబ్రవరి 2న పాక్ కొలంబోకు చేరనున్నట్లు తెలిసింది. ఈ మేరకు శుక్రవారం అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. భారత్, శ్రీలంక ఉమ్మడిగా ఆతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్‌ను తప్పించినందుకు ఈ టోర్నీని బహిష్కరించాలని పాక్ భావిస్తున్నట్లుగా వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. ప్రపంచకప్‌లో ఆడినా భారత్‌తో తలపడకూడదని పాక్ యోచిస్తున్నట్లు కూడా ప్రచారం జరిగింది. అయితే పాక్ బెదిరింపులకు ఇటు బీసీసీఐ, అటు ఐసీసీ ఏమాత్రం తలొగ్గలేదు. ఆ జట్టుతో సంప్రదింపులు కూడా జరపలేదు. టోర్నీకి దూరమైతే భారీ నష్టం చవిచూడాల్సి వస్తుందని అర్థం చేసుకున్న పీసీబీ.. జట్టును పంపడానికి సిద్ధమైంది. అన్ని అంశాల్ని పరిగణనలోకి తీసుకుని, పాకిస్థాన్ క్రికెట్ భవిష్యత్ దృష్ట్యా మిగతా దేశాలతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మోసిన్ నఖ్వికి పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్ సూచించినట్లు సమాచారం. 2027 వరకు భారత్‌లో జరిగే ఐసీసీ టోర్నీల్లో తమ మ్యాచ్‌లన్నీ పాక్ ప్రత్యామ్నాయ వేదికల్లో ఆడనుంది.

## నా ఆలోచనా ధోరణి మెరుగవుతోంది



విశాఖపట్టణం: పేస్ బౌలర్లను ఎదుర్కోవడంలో మెరుగయ్యానని భారత ఆల్‌రౌండర్ శివమ్ దూబె చెప్పాడు. అతడు న్యూజిలాండ్‌తో నాలుగో టీ20లో (15 బంతుల్లో 65 పరుగులు) విధ్వంసక ఇన్నింగ్స్‌తో రాబోయే టీ20 ప్రపంచకప్‌లో ప్రత్యర్థి జట్లకు హెచ్చరికలు పంపాడు. ఈ నేపథ్యంలో దూబె మాట్లాడుతూ.. ''బ్యాటుతో ఉత్తమ ప్రదర్శన చేసేందుకు నెట్స్‌లో శ్రమిస్తున్నా. నా ఆలోచనా ధోరణి మెరుగవుతోంది. బౌలర్లను అంచనా వేయగలుగుతున్నా. బ్యాటింగ్, బౌలింగ్‌లో అవకాశం ఇచ్చిన ప్రధాన కోచ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌లకు ధన్యవాదాలు. బౌలింగ్ వేయడం వల్ల తెలివిగా బ్యాటింగ్ ఎలా చేయాలో నేర్చుకోవచ్చు. నా నైపుణ్యాలు పెంపొందించుకునే దిశగా కష్టపడుతున్నా. నా బలమేంటో తెలుసుకుని.. ఎప్పుడు బౌలర్లపై దాడి చేయాలో నేర్చుకున్నా. షాట్ల ఎంపికలో తెలివిగా వ్యవహరిస్తున్నా'' అన్నాడు.

# సబలెంకా x రిబకినా

**–ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో అమీతుమీ**





ప్రపంచ నంబర్‌వన్ అరినా సబలెంకా జోరు కొనసాగుతోంది. తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ ఆమె ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. టైటిల్ కోసం ఆమె అయిదో సీడ్ రిబకినాను ఢీకొంటుంది. టాప్ సీడ్ అరినా సబలెంకా ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక్కడ మూడో టైటిల్‌పై కన్నేసిన ఈ బెలారస్ అమ్మాయి సెమీఫైనల్లో 62, 63తో ఉక్రెయిన్‌కు చెందిన స్వితోలినాను చిత్తుగా ఓడించింది. సబలెంకాకు ఇది వరుసగా నాలుగో ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ కావడం విశేషం. 2023, 2024లో టైటిల్ గెలిచిన ఆమె.. నిరుడు తుది పోరులో పరాజయం పాలైంది. సబలెంకా సెమీస్‌లో స్వితోలినాపై పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. సెమీస్ చేరే క్రమంలో ఇద్దరు టాప్10 ప్లేయర్లను ఓడించిన 12వ సీడ్ స్వితోలినా.. సబలెంకా పవర్ హిట్టింగ్ ముందు నిలవలేకపోయింది. ఆమె చేతిలో స్వితోలినాకు ఇది వరుసగా ఆరో ఓటమి. సబలెంకా ఈ ఏడాది ఇప్పటివరకు ఒక్క సెట్ కూడా కోల్పోలేదు. ఆమె వరుసగా 11 మ్యాచ్‌ల్లో గెలిచింది. సబలెంకా గురువారం సెమీఫైనల్లో 29 విన్నర్లు కొట్టింది. నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసింది. సర్వీసులో 11 పాయింట్లు మాత్రమే జారవిడిచింది. మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసిన స్వితోలినా.. 17 అనవసర తప్పిదాలు చేసింది. 12 విన్నర్లు మాత్రమే కొట్టింది. ఏకపక్షంగా సాగిన సెమీఫైనల్లో ఆరంభం నుంచీ సబలెంకాదే ఆధిపత్యం. ఆమె బలమైన ఫోర్ హ్యాండ్ షాట్లతో విరుచుకుపడింది. నాలుగో గేమ్‌లో బ్రేక్‌తో 31తో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన సబలెంకా.. ఆ తర్వాత సర్వీసులు నిలబెట్టుకుని 52తో నిలిచింది. ఏడో గేమ్‌లో తిరిగి బ్రేక్ సాధించి సెట్‌ను చేజిక్కించుకుంది. అయితే రెండో సెట్లో తొలి గేమ్‌లోనే సబలెంకా సర్వీసును బ్రేక్ చేసిన స్వితోలినా.. పుంజుకున్నట్లు కనిపించింది. కానీ ఆమె ఆనందం ఎంతో సేపు నిలవలేదు. బలంగా పుంజుకున్న సబలెంకా.. నాలుగు, ఆరో గేముల్లో బ్రేక్‌లు సాధించి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత ప్రత్యర్థికి ఎలాంటి అవకాశమివ్వలేదు. ఏడో గేమ్‌లో సర్వీసు నిలబెట్టుకుని 52తో నిలిచిన సబలెంకా.. తొమ్మిదో గేమ్‌లో మ్యాచ్‌ను ముగించింది. మార్టిన్ హింగిస్ (2002) తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుసగా నాలుగుసార్లు ఫైనల్ చేరిన తొలి ప్లేయర్‌గా సబలెంకా ఘనత సాధించింది. ''దీన్ని నేను నమ్మలేకపోతున్నా. ఇదో గొప్ప ఘనత. కానీ నా పని ఇంకా పూర్తి కాలేదు'' అని సెమీఫైనల్ అనంతరం ఆమె వ్యాఖ్యానించింది. శనివారం జరిగే ఫైనల్లో సబలెంకా.. కజకిస్థాన్ అమ్మాయి రిబకినాను ఢీకొంటుంది. సెమీఫైనల్లో రిబకినా 63, 76 (97)తో ఆరో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా)పై విజయం సాధించింది. తొలి సెట్‌ను తేలికగా గెలుచుకున్న రిబకినా.. రెండో సెట్లో తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొంది. హోరాహోరీ పోరులో టైబ్రేక్‌లో సెట్‌ను గెలుచుకుని రిబకినా ఫైనల్లో అడుగుపెట్టింది. పెగులా రెండు సెట్ పాయింట్లు సాధించినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఈ మ్యాచ్‌లో రిబకినా 6 ఏస్‌లు, 31 విన్నర్లు కొట్టింది. నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసింది. మహిళల సింగిల్స్ ఫైనల్ రసవత్తరంగా సాగడం ఖాయం. 2023 ఫైనల్లో సబలెంకా చేతిలో ఓటమికి ప్రతీకారం తీర్చుకోవడానికి రిబకినాకు ఇది చక్కని అవకాశం. సబలెంకాతో ముఖాముఖి పోరులో ఆమె 65తో ఆధిక్యంలో ఉండడం విశేషం.

**సినర్‌తో జకోవిచ్ ఢీ....** ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో ఆసక్తికర సమరానికి వేళైంది. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో పదిసార్లు ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా).. డిఫెండింగ్ ఛాంపియన్ యానిక్ సినర్ (ఇటలీ)ను ఢీకొంటాడు. రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన 37 ఏళ్ల జకోవిచ్‌కు 24 ఏళ్ల సినర్‌తో పోరు ఎంతో కఠినమైందే. ఈ టోర్నీలో నాలుగో రౌండ్లో వాకోవర్ పొందిన జకోవిచ్‌కు క్వార్టర్స్‌లోనూ అదృష్టం కలిసొచ్చింది. రెండు సెట్లు గెలిచి ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి ముసెటి గాయం కారణంగా వైదొలిగాడు. మరోవైపు ప్రపంచ నంబర్ 2 సినర్ సూపర్ ఫామ్‌తో సెమీస్ చేరుకున్నాడు. జకోవిచ్‌తో ముఖాముఖి పోరులో సినర్ 64తో ఆధిక్యంలో ఉన్నాడు. మరో సెమీఫైనల్లో మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ)తో ప్రపంచ నంబర్‌వన్ అల్కరాస్ (స్పెయిన్) తలపడతాడు.

## విజృంభించిన సిరాజ్



టీమ్‌ఇండియా పేసర్ మహ్మద్ సిరాజ్ (4/56) రంజీ ట్రోఫీలో సత్తా చాటాడు. గురువారం ఉప్పల్ స్టేడియంలో మొదలైన ఎలీట్ గ్రూప్‌డిలో మ్యాచ్‌లో హైదరాబాద్ కెప్టెన్ సిరాజ్‌తో పాటు రక్షణ్ రెడ్డి (2/28) రాణించడంతో ఛత్తీస్‌గఢ్ తొలి ఇన్నింగ్స్‌లో 72.3 ఓవర్లలో 283 పరుగులకు ఆలౌటైంది. ప్రతీక్ యాదవ్ (106) సెంచరీ సాధించగా.. వికల్ప్ తివారి (94) త్రుటిలో శతకం కోల్పోయాడు. 58 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన ఛత్తీస్‌గఢ్‌ను.. ప్రతీక్, వికల్ప్ ద్వయం ఆరో వికెట్‌కు 183 పరుగులు జోడించి ఆదుకుంది. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన హైదరాబాద్.. ఆట చివరికి వికెట్ నష్టపోకుండా 56 పరుగులు చేసింది. అమన్ రావు (32 నాటౌట్), అభిరథ్ రెడ్డి (23 నాటౌట్) క్రీజులో ఉన్నారు.